Follow: @ANNTELUGU
02-05-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 150 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భూ భారతికి అనూహ్య స్పందన

**నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి**

- 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి
- భూ సమస్యలపై 11,630 దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 5వ తేది నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారతి
- 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి
- మార్పుకు భూభారతి సంకేతం : మంత్రి పొంగులేటి

వివరాలు 2లో

**టాప్ న్యూస్**


### గుస్‌కే మారెంగే అన్నారుగా..!



- మోడీ ముందు ఒవైసీ సంచలన డిమాండ్
- పీవోకేలో మకాం వేద్దాం

02

### రాష్ట్రపతికి తెలంగాణ బీసీ బిల్లు



- నేడు గవర్నర్ జిష్ణుదేవ్ ను కలిసి ధన్యవాదాలు తెలపనున్న పీసీసీ చీఫ్, మంత్రులు


02

### ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతాం



- మోదీ ప్రభుత్వంలో ఎవరూ తప్పించుకోలేరు
- అమిత్ షా వార్నింగ్

03



### ఇంకా భారత్‌లోనే పహల్గాం ఉగ్రవాదులు

- దక్షిణ కశ్మీర్ అడవుల్లో దాక్కున్న ముష్కరులు
- జమ్మూ కశ్మీర్‌లోనే దాక్కొని ఉన్నట్లు ఎన్ఐఏ అనుమానం

వివరాలు 2లో



### ఏపీ డ్రీమ్ క్యాపిటల్

- నేడు మోదీ చేతుల మీదుగా అమరావతి పున: ప్రారంభం
- 49,040 కోట్ల పనులకు శ్రీకారం.. ఏపీకి నూతన దిశదశ

వివరాలు 2లో



### ముంబై డబుల్ హ్యాట్రిక్..

- ప్లే ఆఫ్స్ రేసు నుంచి రాజస్థాన్ ఔట్

వివరాలు 8లో



### స్వాతంత్ర్యానికి పూర్వం కులగణన

**దేశంలో చివరి సారిగా సమగ్ర కుల గణన జరిగింది 1931లో అంటే దాదాపు ఒక శతాబ్దం కిందట. అదీ అవిభక్త భారతదేశంలో అన్న మాట. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం, తర్వాత దేశం ముక్కలు కావడం. బంగ్లాదేశ్, పాకిస్తాన్ లతో అనేక పర్యాయాలు యుద్ధం జరగడం, అటు వారు ఇటు రావడం ఎన్నోసార్లు జరిగింది. ఇన్ని మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి.**

వివరాలు 4లో



# సాహో.. రేవంత్

## బహుజన బాంధవుడికి జేజేలు

### కులగణనతో తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపిన సీఎంపై అభినందనల వర్షం

### సీఎం రేవంత్ కు బీసీనేతలు, సంఘాలు, ప్రజాప్రతినిధుల అభినందనలు

### కులగణనకు రోడ్ మ్యాప్ ప్రకటించాలి.. కేంద్రానికి మా సహకారం అందిస్తాం సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడం, ఈ నిర్ణయానికి తెలంగాణే రోల్ మోడల్ అని దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపుతో మంత్రివర్గ ఉపసంఘాన్ని, డెడికేషన్ కమిషన్లను ఏర్పాటుచేసి భారతదేశ చరిత్రలో ఎవరూ చేయని విధంగా కులగణన చేయడంతో పాటు ఆ లెక్కలు ప్రకటించి, బీసీ బిల్లుతో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీ సాక్షిగా తీర్మానించడం ఇపుడు దేశంలోనే హైలెట్ గా మారింది. బిహార్ ఎన్నికల ముందు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయమే రోల్ మోడల్ కావడంతో అభినందనల జల్లు కురుస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో పలువురు మంత్రులు, సలహాదారులు, ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. చట్ట పరమైన చిక్కులు ఎదురుకాకుండా శాస్త్రీయ పద్ధతిలో దేశంలో కుల గణన పూర్తి చేసిన ఘనత తెలంగాణకే దక్కుతుందని, దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణను నిలిపిన ఘనత సీఎం రేవంత్ దేనంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ , సలహాదారు కేశవరావు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, రాజకీయ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున జూబ్లీహిల్స్ నివాసానికి వెళ్ళి ముఖ్యమంత్రిని అభినందించారు.

మిగతా 3లో

### సమ్మె ఆలోచన వీడండి

- ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోవద్దు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- త్వరలో రాష్ట్రంలో గిగ్ వర్కర్స్ పాలసీ

వివరాలు 3లో

### 2027 డిసెంబర్ నాటికి పాలమూరు రంగారెడ్డి

# ప్రాజెక్టు పూర్తి

### 2026 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టేంపాడు, భీమా, కోయిలసాగర్ ప్రాజెక్టుల పూర్తి

ఎనిమిది నెలల వ్యవధిలో నార్లపూర్,ఏదుల,వట్టెం, కరివేన రిజర్వాయర్లకు 50 టీఎంసీల నీరు

కార్యాచరణ వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మహబూబ్ నగర్, మహా :** 2027 డిసెంబర్ మాసాంతానికి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2026 మార్చి చివరికి కల్వకుర్తి,నెట్టేంపాడు,భీమా,కోయిలసాగర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. మరో ఎనిమిది నెలల వ్యవధిలో నార్లపూర్,ఏదుల,వట్టెం,కరివేన రిజర్వార్లలో 50 టి.యం.సి ల నీటిని నింపబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

మిగతా 2లో

### లాభాల బ్యాంకులు

ఫెడరల్ బ్యాంక్ లాభం ప్లస్

బంధన్ బ్యాంక్ లాభం దూకుడు

07

# ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

## వేవ్స్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ

- మానవ సమాజ సున్నితత్వాన్ని కాపాడాలి
- మనుషులు రోబోల్లా మారకూడదు
- ముంబై వేదికగా నాలుగు రోజుల పాటు సదస్సు
- వరల్డ్ ఆడియో, విజువల్, ఎంటర్ టైన్మెంట్ గా సమావేశాలు
- హాజరైన సినీ దిగ్గజాలు



**ముంబై:** అంతర్జాతీయ ప్రతిభ, సృజనాత్మకతల కోసం ప్రపంచ వేదిక నిర్మాణానికి వేవ్స్ పునాది వేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్ , గేమింగ్, ఫ్యాషన్, మ్యూజిక్, కాన్సర్ట్‌లకు భారతదేశం కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న వేళ ప్రపంచ ప్రతిభకు ఒక వేదికను అందించే సామర్థ్యం వేవ్స్‌కు ఉంటుందని ప్రధాని తెలిపారు. ముంబయిలో తొలి గ్లోబల్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్ వేవ్స్‌ను మోదీ ప్రారంభించారు.

మిగతా 3లో

## బీసీలకు న్యాయం కోసమే కులగణన

### సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం

### తెలంగాణలో కులగణన తూతూమంత్రమే.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**మహా :** బీసీలకు న్యాయం చేయాలన్నదే బీజేపీ సంకల్పమని, అంజదులో భాగంగానే కులగణన చేయాలని నిర్ణయించడం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు.

మిగతా 2లో

### దూసుకొస్తున్న కాస్మోస్ 482

07

# రెండేళ్లలో మూసీ ప్రక్షాళన

- రూ. 3100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్ల నిర్మాణం
- మూసి మురుగుకు చెక్.. ఊహించని రేంజ్‌లో ప్రణాళిక
- నదికి ఇరువైపులా ట్రంక్ లైన్ల నిర్మాణం



**మహా:** హైదరాబాద్ నగర వాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మిగతా 2లో

# భూ భారతికి అనూహ్య స్పందన



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతికి అనూహ్యస్పందన కనబడుతోంది. అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూ భారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్ గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణ్ పేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగు మండలాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు.

ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ రెండు సదస్సుల్లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించింది. ఇందుకోసం మండల స్థాయిలో తహశీల్దార్ డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. ఈ భూభారతి చట్టం రైతులకు అర్థమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఒక సవాల్ గా తీసుకొని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీనుంచి 30వ తేదీవరకు 20 జిల్లాల్లో 45 సదస్సులలో పాల్గొన్నారు.

**505 మండలాల్లో సదస్సులు పూర్తి**

నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సులను పూర్తిచేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు ఆయా మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేశారు. ఒక ప్రత్యేక ఫార్మాట్ లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు. లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 మొత్తం 11, 630 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీపీబీకి సంబంధించి 3,446, సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్ లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకు గాను 555 మండలాలలో బుధవారం నాటికి సదస్సులు పూర్తి అయ్యాయి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలాన్నిపైలట్ గా తీసుకొని 28 మండలాల్లో పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

**ఇది నవశకం : మంత్రి పొంగులేటి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మక మార్పుకు నాందిగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ చట్టం ఉంది. ఈచట్టానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో తమ భూ సమస్యలు ఈ భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే నమ్మకం, విశ్వాసాన్ని రైతులు వ్యక్తం చేశారు. ధరణితో వారు అనుభవించిన కష్టాలను, బాధలను వ్యక్తం చేశారు. ధరణి తో వారు ఎదుర్కొన్న సమస్యలను చెప్తుంటే వారు పడ్డ కష్టం కళ్ళముందే కనిపించింది. రైతుల భూ సమస్యలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించడానికి అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశాం. ఇకనుండి రైతులు ఏ కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయంలోనే వాళ్ళ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు పరిష్కరించే విధానం నిరంతరం కొనసాగుతుంది. ఈ పైలట్ నాలుగు మండలాలలో కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలు మినహా అన్ని సమస్యలను జూన్ 2వ తేదీ నాటికి పరిష్కరిస్తాం. ఆ నాలుగు పైలట్ మండలాల మాదిరిగానే ఈ నెల 5వ తేది నుంచి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పూర్తి స్థాయిలో భూ భారతిని అమలు చేస్తున్నాం. చట్టం తీసుకువస్తే సరిపోదు, ఆ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగినప్పుడే రైతులకు నిజమైన న్యాయం లభిస్తుంది. ఆ దిశగా మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



# రెండేళ్ళ గడవులో మూసీ ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది. గతంలో జంట జలాశయాల నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది.

ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్‌డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఉత్తరం వైపు తారామతి బారాదరి, నానక్‌రామ్‌గూడ, ఇబ్రహీం చెరువు, కార్వాన్, నాంపల్లి, నారాయణగూడ, అంబర్‌పేట, రామంతాపూర్, పీర్జాదిగూడ, కొర్రెముల ప్రాంతాల మీదుగా 27.5 కిలోమీటర్ల మేర రూ. 1,054 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టనుండగా.. దక్షిణం వైపు బాపూఘాట్, అత్తాపూర్, చార్మినార్, మలక్‌పేట్, నాగోల్, గౌరెల్లి ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల మేర రూ. 1,048.95 కోట్లతో నిర్మాణం చేపడతారు. నదికి ఉత్తరం, దక్షిణం వైపున నగరంలో రూ. 996.96 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.



# గుస్‌కే మారెంగే అన్నారుగా..!

## మోడీ ముందు ఒవైసీ సంచలన డిమాండ్


### పీవోకేలో మకాం వేద్దాం

**మహా:** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌పై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ఉగ్రవాదంపై తరచుగా చెప్పే మాట 'ఇంట్లోకి దూరి చంపేస్తాం(గుస్కే మారెంగే)' అనే దానికి బదులుగా.. అక్కడికి వెళ్లి( పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్)కి ప్రవేశించి అక్కడే తిష్టవేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలను భారత్ భయానికి ఖాళీ చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఒవైసీ స్పందించారు. వారు ఖాళీ చేసి వుంటే.. మనం వెళ్లి అక్కడే ఉండాలి. ఈసారి కేంద్రం ఏదైనా చర్య తీసుకుంటే.. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ ను స్వాధీనం చేసుకోవాలని ఒవైసీ సూచించారు. పీవోకేను భారతదేశానికి చెందిందనే పార్లమెంటులో తీర్మానం కూడా ఉందని గుర్తు చేశారు.

# రెండేళ్ళ గడవులో మూసీ ప్రక్షాళన

- రూ. 3100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్ల నిర్మాణం
- మూసి మురుగుకు చెక్.. ఊహించని రేంజ్‌లో ప్రణాళిక
- నదికి ఇరువైపులా ట్రంక్ లైన్ల నిర్మాణం

**మహా :** హైదరాబాద్ నగర వాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది.



గతంలో జంట జలాశయాల నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్‌డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఉత్తరం వైపు తారామతి బారాదరి, నానక్‌రామ్‌గూడ, ఇబ్రహీంచెరువు, కార్వాన్, నాంపల్లి, నారాయణగూడ, అంబర్‌పేట, రామంతాపూర్, పీర్జాదిగూడ, కొర్రెముల ప్రాంతాల మీదుగా 27.5 కిలోమీటర్ల మేర రూ. 1,054 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టనుండగా.. దక్షిణం వైపు బాపూఘాట్, అత్తాపూర్, చార్మినార్, మలక్‌పేట్, నాగోల్, గౌరెల్లి ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల మేర రూ. 1,048.95 కోట్లతో నిర్మాణం చేపడతారు. నదికి ఉత్తరం, దక్షిణం వైపున నగరంలో రూ. 996.96 కోట్లతో ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.


## ఇంకా భారత్‌లోనే

# పహల్గాం ఉగ్రవాదులు

### దక్షిణ కశ్మీర్ అడవుల్లో దాక్కున్న ముష్కరులు

### జమ్మూ కశ్మీర్‌లోనే దాక్కొని ఉన్నట్లు ఎన్ఐఏ అనుమానం

**మహా:** పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రత బలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఇంకా దేశం విడిచి పారిపోలేదని జాతీయ పరిశోధన సంస్థ వెల్లడించింది. వీరంతా జమ్ము కశ్మీర్‌లోనే దాక్కొని ఉన్నట్లు ఎన్ ఐఏ అధికారులు అనుమానిస్తున్నారు. దక్షిణ కశ్మీర్‌లోని అటవీ ప్రాంతాల్లో ముష్కరులు తలదాచుకుంటున్నట్లు ఎన్ ఐఏ తెలిపింది. పర్యాటకులపై దాడి చేసిన అనంతరం వీరంతా అటవీ ప్రాంతంలోకి వెళ్లి దాక్కున్నట్లు బలమైన ఆధారాలు ఉన్నాయని ఎన్ ఐఏ అధికారులు చెప్పారు. ఆహారం, ఇతర అవసరమైన సామగ్రి ముష్కరుల వద్ద ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అంతేకాదు ఆ ప్రాంతాల్లో మరింత మంది ఉగ్రవాదులు దాక్కొని ఉన్నట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని ఎన్ ఐఏ అధికారులు తెలిపారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రసంస్థే 2024లో గాందర్‌బల్ జిల్లాలో సొరంగంలో దాడికి పాల్పడినట్లు నిఘా వర్గాలు నిర్ధరించాయి. లష్కరే తోయిబా ఉగ్రసంస్థ మద్దతున్న ఈ ఉగ్రవాద విభాగం ఈ రెండు దాడులు చేసినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఆ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులే తాజాగా పహల్గాం దాడిలో పాల్గొన్నట్లు పేర్కొన్నాయి. పహల్గాం దాడిలో ప్రమేయం ఉన్న లష్కరే ఉగ్రవాది హాషీం ముసా అలియాస్ సులేమాన్ అప్పటి



దాడిలో పాల్గొన్నట్లు నిఘా వర్గాలు నిర్ధరించాయి. గతేడాది గాందర్‌బల్ జిల్లా సోనామార్గ్‌లోని జెడ్ మోర్ సొరంగం ప్రాజెక్టు వద్ద ఉగ్రదాడి జరిగింది. ప్రైవేట్ నిర్మాణ సంస్థ నిర్వహిస్తున్న కార్మికుల శిబిరంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఆ దాడిలో ఓ వైద్యుడు సహా ఆరుగురు కార్మికులు మృతి చెందారు. నాటి దాడిలో పాల్గొన్న ఉగ్రవాది జునైద్ అహ్మద్ భట్‌ను గతేడాది డిసెంబర్‌లో భద్రత బలగాలు మట్టుబెట్టాయి. తర్వాత ఆ గ్రూపునకు చెందిన మరో ఇద్దరు ఉగ్రవాదులను కూడా హతమార్చినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. అయితే, పర్యటకులపై దాడి చేసిన వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించాయి భద్రతాదళాలు. వీరికి మూసా, యూనిస్, ఆసీఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ ముగ్గురి ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేశారు.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. సాయంత్రం ఢిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ వెళ్తున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ ముఖ్య నాయకులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్య కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కుల గణన అంశంపై ఈ సమావేశంలో ప్రధాన చర్చ జరుగుతుందని సమాచారం. కుల గణనపై కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, విధానాలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# రాష్ట్రపతికి తెలంగాణ బీసీ బిల్లు

## నేడు గవర్నర్ జిష్ణుదేవ్ ను కలిసి ధన్యవాదాలు తెలపనున్న పీసీసీ చీఫ్, మంత్రులు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం శాసనసభ, మండలిలో బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన బిల్లును గవర్నర్ ఆమోదించిరాష్ట్రపతికి పంపిన నేపథ్యంలో ధన్యవాదాలు తెలపాలని కాంగ్రెస్ అగ్రనేతలు నిర్ణయించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాజ్ భవన్ కు కాంగ్రెస్ నేతలు వెళ్ళనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కేకేశవ రావు,మధుయాష్కీ నేతృత్వంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కాంగ్రెస్ నేతలు కలవనున్నారు.బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కాంగ్రెస్ కీలక నేతలు ఇందులో పాల్గొంటారు.

# ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతాం

## మోదీ ప్రభుత్వంలో ఎవరూ తప్పించుకోలేరు.. అమిత్ షా వార్నింగ్

**మహా:** దేశం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మోదీ సర్కారు సంకల్పమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతామని పునరుద్ఘాటించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా, నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఏ ఉగ్రవాది తప్పించుకోలేరని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో ప్రపంచమంతా భారత్‌తో నిలుస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పోరాటం ఆగదన్న అమిత్ షా, ఉగ్రదాడికి పాల్పడినవారికి తగిన శిక్ష విధిస్తామని పునరుద్ఘాటించారు.

**గడువు పెంచిన భారత్**

మరోవైపు పాకిస్థాన్ జాతీయులు భారత్ విడిచి వెళ్లిపోవాలన్న గడువు బుధవారంతో ముగియడంతో మరోసారి ఆ ఉత్తర్వులను కేంద్ర హోంశాఖ పొడిగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తదుపరి ఆదేశాలు వెలువడేవరకు పాక్ జాతీయులు వాఘాఅటారీ సరిహద్దు నుంచి పాకిస్తాన్ వెళ్లేందుకు వెసులుబాటు కల్పించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

## 2027 డిసెంబర్ నాటికి పాలమూరు రంగారెడ్డి


# ప్రాజెక్టు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన నీటి ప్రాజెక్టులనుగురువారం ఆయన పరిశీలించారు. కొల్హాపూర్ మండలం నార్లపూర్ రిజర్వాయర్ వద్ద స్టేజ్ 1పంపింగ్ స్టేషన్,6.4 టి.యం.సి ల సామర్ధ్యం కలిగిన నార్లాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించడంతో మొదలైన మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన మండుటెండలను సైతం ఖాతరు చేయకుండా ఏదుల రిజర్వాయర్ప్యాకేజీ 3 కింద నిర్మిస్తున్న వరద కాలువ పురోగతి పనులను ఆయన స్వయంగా సమీక్షించారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వం విస్మరించిన ప్యాకేజ్ 3 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అటు నుండి వనపర్తి జిల్లా రెవల్లి మండలం ఏదుల గ్రామానికి చేరుకుని అక్కడ రిజర్వాయర్ పనులతో పాటు కోడైర్ మండలం తీగలపల్లి వద్ద నిర్మిస్తున్న స్టేజి3పంపింగ్ స్టేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఆ తదుపరి ఉయ్యాలవాడ లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయాల భవనాలను ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. అదే క్రమంలో బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో స్టేజి3పంపింగ్ స్టేషన్ నిర్మాణపు పనులతో పాటు వట్టెం రిజర్వాయర్ పనుల పురోగతిపై ఆయన అధికారులతో సమీక్షించారు.

**యాక్షన్ ప్లాన్**

నార్లపూర్,ఏదుల,వట్టెం,కరివేన రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీటిని నింపాలని నిర్ణీత గడువు పెట్టుకున్నామని, ఆ గడువు లోపు నింపాలని అధికారులను ఆదేశించినట్లు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. 2026 మార్చి మాసంతానికి ఉద్దండపూర్ రిజర్వాయర్ నింపడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2026 మార్చి చివరి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు,భీమా,కోయిలసాగర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీళ్లు అందిస్తామన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రెండు




మోటార్లు పని చేయడం లేవని వాటిని మూడు నెలల వ్యవధిలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. జిల్లాల ప్రాజెక్టు ల నిర్మణాలకు అవసరమైన భూసేకరణ, పునరావాసం కు సంబంధించిన నివేదిక రూపొందించాలని అధికారులను అదేశించి నట్లు ఆయన తెలిపారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమన్నారు. బీఆర్ఎస్ పాలకులు సాగునీటి అంశంలో తెలంగాణా ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన మండిపడ్డారు. బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 811 టి.యం.సిల నీటిని కేటాయించినప్పటికీ నాటి ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖామంత్రి తెలంగాణాకు కేవలం 299 టీఎంసీల నీటిని వాడుకుని ఆంధ్రప్రదేశ్ కు 511 టీఎంసీల నీటిని ధారదత్తం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు.

**ఎస్ ఎల్బీసీపై జీఎస్ఐ హెచ్చరిక**

ఎస్ఎల్బీసీ అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం సంఘటనా స్థలికి చేరుకోవడం ప్రమాదకరమని హెచ్చరించిన నేపథ్యంలో తదుపరి సహాయక చర్యల కోసం ఉన్నత స్థాయిలో సాంకేతిక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అదే విదంగా ప్రమాదంలో మృతి చెందిన క్షతగాత్రుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.

# ఏపీ డ్రీమ్ క్యాపిటల్

- నేడు మోదీ చేతుల మీదుగా అమరావతి పున: ప్రారంభం
- 49,040 కోట్ల పనులకు శ్రీకారం.. ఏపీకి నూతన దిశదశ



**అమరావతి, మహా:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ఏపీలో పర్యటించనున్నారు. రాజధాని అమరావతి పున: ప్రారంభకార్యక్రమంలో పాల్గొనేందుకు మోదీ ఏపీకి రానున్నారు. అమరావతిలో చేపట్టే రూ.49,040 కోట్ల పనులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. శాశ్వత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాలతో పాటు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, ఎమ్మెల్యేలు, మంత్రుల గృహ సముదాయాలు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్మాణాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం 2:55 గంటలకు మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో మోదీకి మంత్రులు, నేతలు స్వాగతం పలుకనున్నారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3:15 గంటలకు వెలగపూడి సచివాలయం వద్ద ఉన్న హెలిపాడ్‌కు పీఎం చేరుకుంటారు. హెలిపాడ్ వద్ద ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘన స్వాగతం పలకనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు సభాస్థలికి చేరుకుని అమరావతి పున:ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని పాల్గొననున్నారు. రాజధాని అమరావతిలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కేంద్రం చేపట్టిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఒక గంటా 15 నిమిషాల పాటు ప్రధాని మోదీ సభలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 4:55 గంటలకు తిరిగి హెలికాప్టర్ ద్వారా గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు మోదీ. అక్కడి నుంచి విమానం ద్వారా ఢిల్లీకి వెళ్లనున్నారు.

# ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

## వేవ్స్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ



(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లు, స్టార్టప్‌లు, ఇండస్ట్రీ లీడర్లు, పాలసీ మేకర్లను ఒకచోట చేర్చడం ద్వారా భారత్‌ను మీడియా, వినోదం డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా ఉంచడం వేవ్స్ లక్ష్యమని మోదీ చెప్పారు. సామాజిక మాధ్యమాలు, ఓటీటీల్లో అసభ్య కంటెంట్‌ను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, సమాజంలో సృజనాత్మకమైన బాధ్యతలు కలిగి ఉండటం ముఖ్యమన్నారు. మనుషులు రోబోల్లా మారకూడదని హితవుపలికిన ప్రధాని, మానవ సమాజ సున్నితత్వాన్ని కాపాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మారుతున్న సాంకేతికతతో స్క్రీన్ పరిమాణం మినీగా మారుతున్నప్పటికీ భారతదేశం కథలు మెగాగా మారుతున్నాయని ఆయన అన్నారు. "వంద కోట్లకు పైగా జనాభా ఉన్న ఈ భారతదేశం, వందల కోట్లకు పైగా కథలకు నిలయం. గత శతాబ్ధకాలంగా ప్రపంచంలోని నలుమూలలా భారతదేశానికి ప్రాచుర్యాన్ని వ్యాప్తి చేయడంలో భారతీయ సినిమా విజయవంతమైంది. రష్యాలో రాజ్‌కపూర్‌కు, సత్యజిత్ రేకు కేన్స్‌లో ఉన్న ప్రజాధరణ ఆస్కార్‌లో ట్రిపుల్ ఆర్ సాధించిన విజయాలే ఇందుకు సాక్ష్యాలు."అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

**హాజరైన సినీ ప్రముఖులు..**

ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్ , రణబీర్ కపూర్ , దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, అమిర్ ఖాన్, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్. హేమ మాలిని, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, దిగ్గజ దర్శకుడు రాజమౌళి, అలియాభట్, కీరవాణి తదితరులు హాజరయ్యారు.

# ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతాం

## మోదీ ప్రభుత్వంలో ఎవరూ తప్పించుకోలేరు: అమిత్ షా వార్నింగ్

**మహా:** దేశం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మోదీ సర్కారు సంకల్పమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ప్రతి ఒక్క ఉగ్రవాదిని మట్టుబెడతామని పునరుద్ఘాటించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా, నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఏ ఉగ్రవాది తప్పించుకోలేరని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో ప్రపంచమంతా భారత్‌తో నిలుస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పోరాటం ఆగదన్న అమిత్ షా, ఉగ్రదాడికి పాల్పడినవారికి తగిన శిక్ష విధిస్తామని పునరుద్ఘాటించారు.

**గడువు పెంచిన భారత్**

మరోవైపు పాకిస్థాన్ జాతీయులు భారత్ విడిచి వెళ్లిపోవాలన్న గడువు బుధవారంతో ముగియడంతో మరోసారి ఆ ఉత్తర్వులను కేంద్ర హోంశాఖ పొడిగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తదుపరి ఆదేశాలు వెలువడేవరకు పాక్ జాతీయులు వాఘాఅటారీ సరిహద్దు నుంచి పాకిస్తాన్ వెళ్లేందుకు వెసులుబాటు కల్పించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

# బీసీలకు న్యాయం కోసమే కులగణన

## సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం

### తెలంగాణలో కులగణన తూతూమంత్రమే.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. 2011 జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారన్నారు. నాడు సుష్మాస్వరాజ్ అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి రాసిన లేఖను మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి చూపించారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని, ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చన్నారు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కులగణన కావాలని నిజంగా కాంగ్రెస్ కోరుకుంటే గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదని,



సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నామన్నారు. కాంగ్రెస్‌లా ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయమన్నారు. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూ మంత్రంగా చేసిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# జగన్ వీరాభిమానికి వాసుపల్లి 10 వేలు సాయం అందించిన వాసుపల్లి

**విశాఖ ,పక్షిమ ,మహా :** విశాఖ పక్షిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందిస్తున్న నిరంతర ఆర్థిక సహాయం, పలు సేవా కార్యక్రమాలుకి ప్రజలతోపాటు దక్షిణ వైసీపీ శ్రేణులు కూడా ఫిదా అవుతున్నారు. దక్షిణ ప్రజలకు మాత్రమే కాకుండా తనతో పాటు నడిచే వైసిపి నాయకులకు కార్యకర్తల కష్టాల్లో అండగా ఉంటున్నారు. దీనిలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీరాభిమాని, దక్షిణ బీసీ సెల్ అధ్యక్షుడు బొండదా వెంకటరావు భార్య అనారోగ్య నిమిత్తం అవసరమైన మందుల ఖర్చులకు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి ఇంటికి వెళ్లి యూరాలజీ సమస్యతో బాధపడుతున్న వెంకట్రావు భార్య బొండదా సత్యవతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని వాసుపల్లి గణేష్ కుమార్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ నిన్న చందనోత్సవంలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జననేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విషయం తెలుసుకునీ భయంతో ప్రభుత్వం పాతిక లక్షలు ప్రకటించిందన్నారు. కానీ ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే పరిగణిస్తున్నామని, తక్షణమే



బాధితులకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వకపోతే వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చాక మిగిలిన రూ. 75 లక్షలు అందిస్తామని జగనన్న ప్రకటించడం గర్వకారణం అన్నారు. కూటమి ప్రభుత్వ తప్పిదాలవలనే నేడు ఏడు ప్రాణాలు బలిగోన్నాయన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకొని ప్రజల సంక్షేమ పాలనపై దృష్టిసారించాలని వాసుపల్లి హితవు పలికారు. ప్రజల పక్షాన ఎప్పుడు వైఎస్ఆర్సిపి అండగా ఉంటుందని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్, 29వ వార్డ్ ప్రెసిడెంట్ పీతల వాసు, 30వ వార్డ్ ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, సౌత్ బూత్ కమిటీ, 39 వ వార్డ్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, సౌత్ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బేవార మహేష్, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, చింతూకాయల వాసు తదితరులు పాల్గొన్నారు

# సాహో.. రేవంత్

## బహుజన బాంధవుడికి జేజేలు

### కులగణనతో తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపిన సీఎంపై అభినందనల వర్షం

### సీఎం రేవంత్ కు బీసీనేతలు, సంఘాలు, ప్రజాప్రతినిధుల అభినందనలు

### కులగణనకు రోడ్ మ్యాప్ ప్రకటించాలి.. కేంద్రానికి మా సహకారం అందిస్తాం సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో విజయవంతంగా కుల గణన పూర్తి చేసిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయానికి రావడం సంతోషకరమైన పరిణామంగా వారు పేర్కొన్నారు.

**కులగణనలో తెలంగాణ మోడల్ తీసుకోవాలి : సీఎం రేవంత్**

కులగణనలో తెలంగాణ మోడల్ తీసుకోవాలని, ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కులగణన సమాజానికి ఎక్స్‌రే లాంటిదని రాహుల్ అన్నారని గుర్తు చేశారు. అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీ పంపాలని, కులగణనలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలని, కులగణన విషయంలో తెలంగాణ రాష్ట్ర అనుభవం వినియోగించుకోవాలని తెలిపారు. "కులగణన చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ విషయంలో మొదట రాహుల్‌కు అభినందనలు చెప్పాలి. కులగణన కోరుతూ రాహుల్



వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. దీనిపై రాష్ట్ర ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చాం. దేశానికి మార్గదర్శకంగా నిలిచాం. దేశంలోని అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయి. కులగణన చేయాలని దిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయి. కులగణన నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యవాదాలు చెబుతున్నాం. కులగణన విషయంలో కేంద్రమంత్రుల కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీలో కేంద్ర మంత్రులు, సీనియర్ అధికారులను నియమించాలి." అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చేశాం

తెలంగాణలో చేపట్టిన 8 పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా వివరాలు సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కులగణన విషయంలో తెలంగాణ అనుభవం కేంద్రానికి ఉపయోగపడుతుందన్నారు. ఎన్యుమరేటర్ నుంచి సీఎస్ వరకు పలుసార్లు సమీక్ష చేసినట్లు వివరించారు. కులగణన విషయంలో అనేక సూచనలు, సలహాలు వచ్చాయన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ ఇచ్చామన్న ఆయన, ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కులగణన చేపట్టామని గుర్తు చేశారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కులగణనలో అన్ని పార్టీలనూ భాగస్వాములు చేశామన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి రోల్ మోడల్ అని రాహుల్ చెప్పారు. కులగణన విషయంలో తమ అనుభవాన్ని కేంద్రంతో పంచుకుంటామని తెలిపారు. నివేదిక తయారు చేశాక పేదలకు లబ్ధి జరగాలని ఆశించారు. ఆలస్యమైనా కేంద్రం మంచి నిర్ణయం తీసుకుందన్న ఆయన, దాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు. కులగణన విషయంలో కేంద్రంపై విమర్శలు చేయడం తనకు ఇష్టం లేదన్నారు.

# సమ్మె ఆలోచన వీడండి

## ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోవద్దు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి.. త్వరలో రాష్ట్రంలో 'గిగ్ వర్కర్స్ పాలసీ

**హైదరాబాద్, మహా:** త్వరలో రాష్ట్రంలో 'గిగ్ వర్కర్స్ పాలసీ' తీసుకురాబోతున్నామని, ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలవబోతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికుల చెమట చుక్కలే ప్రపంచ అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మే డే సందర్భంగా రవీంద్రభారతిలో శ్రమశక్తి, ఉత్తమ యాజమాన్య అవార్డుల ప్రధానం కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ సాధనలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో కార్మికులను ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందంటే కార్మికుల సహకారం ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి లాభాలలో కార్మికులకు వాటా ఇచ్చి బోనస్ ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి వచ్చిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక పద్ధతి ప్రకారం నష్టాలను నివారిస్తూ ముందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు.

**ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టాం**

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టామని, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. కార్మికులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీని త్వరలో తీసుకురాబోతున్నామని ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష చూపించిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసి 50 మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. 'ఆర్టీసీలో సమ్మెపై చర్చలు జరుగుతున్నాయంటున్నారు. ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నా సమ్మె ఆలోచన వీడండి. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది' అని రేవంత్ రెడ్డి తెలిపారు. మీ సంస్థ దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉందని ఆయన అన్నారు. గత పదేళ్లలో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. గత పాలకులు 50 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టారని, 1 లక్షా 20 వేల కోట్లు ఇతర విభాగాల్లో పెండింగ్ పెట్టి వెళ్లారని, సర్పంచులకు బకాయిలు చెల్లించలేదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

**కష్టమైనా, నిష్ఠూరమైనా ఉన్నది చెప్పడం బాధ్యత**

ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోవద్దని, ఏదైనా సమస్య ఉంటే మంత్రితో చర్చించాలని రేవంత్ రెడ్డి సూచించారు. వచ్చే ఆదాయమంతా కార్మికులకే ఖర్చు చేస్తామని, ఎలా ఖర్చు చేయాలో కార్మికులే సూచన చేయాలని ఆయన అన్నారు. అణా పైసా కూడా తాను ఇంటికి తీసుకెళ్లేది లేదని, కార్మికుల కోసమే ఖర్చు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, అందుకే ఒకసారి ఆలోచించాలని ఆయన కోరారు. కష్టమైనా, నిష్ఠూరమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని ఆయన అన్నారు. సమ్మెపోటు రాష్ట్రానికి నష్టం చేస్తుందని, ఆర్టీసీ కార్మికులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి ప్రతీ సంస్థలో 8 లక్షల 29 వేల కోట్లు అప్పు పెట్టి వెళ్లారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. లక్ష కోట్లు పెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో గత పదేళ్లు ఆర్థిక దోపిడీ జరిగిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలలు నుంచి తనతో పాటు మంత్రులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోందని, మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుందని ఆయన తెలిపారు.

# సింహాచలంలో భక్తుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

## దీనిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన

ప్రచార ఆర్భాటమే తప్ప కూటమి కి భక్తుల భద్రతపై శ్రద్ధ లేదు

ఈ మరణాలకు సమీక్ష జరిపిన అయిదుగురు మంత్రులు బాధ్యత వహించాలి

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



**విశాఖ ,మహా :** సింహాచలం చందనోత్సవంలో జరిగిన ఏడుగురు భక్తుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని శాసనసమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణం జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. హైలెవల్ కమిటీ పేరుతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించిన అయిదుగురు మంత్రులు నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే ఈ సంఘటన చోటుచేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మరణాలకు ఈ మంత్రులే బాధ్యత వహించాలని అన్నారు. సింహాచలం చందనోత్సవం నాడు లక్షలాధి మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ ఉంటారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు సింహాచలంకు తరలివస్తుంటారు. ప్రతిఏటా ప్రభుత్వం భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తుగా అన్ని ఏర్పాట్లను చేస్తుంటుంది. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల సమన్వయంతో అన్ని వసతులు, భద్రత కల్పిస్తుంటారు. ప్రతిఏటా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. నిన్న జరిగిన దుర్ఘటన చాలా బాధాకరం. ఏడుగురు దుర్మరణం పాలవ్వడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ సంఘటన జరిగింది. ప్రచార ఆర్భాటంపై చూపించే శ్రద్ధ, భక్తుల భద్రతపై చూపించలేదు. బాధ్యతలను పక్కకుపెట్టి, వీఐపీల సేవకే అధికారులు పరిమితం అయ్యారు. భక్తులు ఎంతమంది వస్తారు, ఏర్పాట్లు ఎలా చేయాలి, భక్తుల రద్దీని ఎలా క్రమబద్ధీకరించాలి, గతంలో చేసిన ఏర్పాట్ల కన్నా మెరుగైన చర్యలు చేపట్టాలనే ఆలోచనే చేయలేదు. ఏడుగురు చనిపోయిన దుర్ఘటన జరిగిన విషయం తెలియగానే మాజీ సీఎం, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ హుటాహుటిన విశాఖకు వచ్చి, బాధిత కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించారు. పార్టీ పరంగా రెండు లక్షల రూపాయలు పరిహారంగా అందించారు. బాధిత కుటుంబాలు కోరుతున్నట్లుగా వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సీఎం, డిప్యూటీ సీఎం వంటి బాధ్యత గల స్థానాల్లో ఉన్న వారు స్పందించలేదు. కానీ ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్ బాధ్యతతో వ్యవహరించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఆత్మస్థైర్యం కల్పించారు.

**హైలెవల్ కమిటీ అంటూ వచ్చిన మంత్రులు ఏం చేశారు?**

గత వారం రోజుల కిందట అయిదుగురు మంత్రులు విశాఖకు వచ్చి సింహాచలం చందనోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం క్షేత్రంలోనే వారు మీడియాతో మాట్లాడారు. సింహాచలంలో ఎన్నడూ చేయని విధంగా అయిదుగురు మంత్రులం ఏర్పాట్లపై సమీక్ష జరిపాం, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్ణయాలు చేస్తున్నాం, చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని ప్రకటించారు. కానీ ఉత్సవంలో ఏం జరిగిందని చూస్తే, చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా విషాదాన్ని మిగిల్చింది. వారి నిర్లక్ష్యానికి ఫలితం ఏడుగురి దుర్మరణం. దీనికి మంత్రులే పూర్తి బాధ్యత వహించాలి. ఏనాడు సింహాచల క్షేత్రంలో ఇటువంటి దారుణం జరగలేదు. చిన్నచిన్న ఘటనలు మినహా ఇలా మరణాలు చోటుచేసుకోలేదు.

**చంద్రబాబు బాధ్యతారహితంగా మాట్లాడారు**

ఇక సీఎం చంద్రబాబు బాధ్యతారహితంగా మాట్లాడారు. సింహాచలంలో భారీ వర్షం కురవడం వల్లే గోడ కూలిందని తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. వాతావరణశాఖలో ఎంత వర్షం కురిసిందో లెక్కలు ఉంటాయి, దానిని బయట పెట్టాలి. సంఘటన జరిగినప్పుడు భారీగా గాలులు వీచాయి, కొంత వర్షం కురిసింది. దీనిని అడ్డం పెట్టుకుని సీఎం, డిప్యూటీ సీఎంలు భారీ వర్షాలు కురిసాయంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. దీనిపై కొద్దిగానైనా బాధగా అనిపించడం లేదా? ఇటువంటి ఘటన ప్రభుత్వానికి తలవంపులు, సిగ్గుపడే అంశం కాదా? ఇటీవలే తిరుపతిలో ఎనిమిది మంది క్యూలైన్లలో చనిపోయారు. నిన్న సింహాచలంలో ఏడుగురు చనిపోతే చీమకుట్టినట్లైనా వారికి లేదు. ముగ్గురితో అధికారుల కమిటీ వేశారు, ఎందుకు దీనిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేయలేదు? మంత్రుల సమీక్ష ఏం జరిగిందో, హైలెవల్ కమిటీ ఏ సూచనలు చేసిందో బయటకు వచ్చేది. ప్రభుత్వంలో పనిచేసే అధికారులతో కమిటీ వేస్తే ఏం ఒరుగుతుంది. సంఘటనా స్థలాన్ని వైయస్ఆర్‌సీపీ ప్రతినిధి బృందంగా పరిశీలించాం. అక్కడ నిర్మించిన గోడకు వినియోగించిన సిమెంట్ చూస్తే కనీసం దానిలో కొంచెమైనా నాణ్యత లేదు. మీడియా మిత్రులు కూడా దీనిని చూశారు. ఇంత నాసిరకంగా వారం రోజుల్లో గోడ నిర్మిస్తారా? దీనికి ఎవరు ఆదేశాలిచ్చారు.



### విశాఖ ఎం.పి భరత్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నగర మేయర్ పీలా

**విశాఖ ,మహా :** విశాఖపట్నం నగర పాలక సంస్థ మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి విశాఖ ఎంపీ శ్రీభరత్ ను వారి క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి విశాఖ నగర అభివృద్ధి కై జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు ..ఈ సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్ అభివృద్ధికి, నగర సుందరీకరణకు జీవీఎంసీకి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇస్తూ నగర మేయర్ గా ఆదర్శ పూరితమైన పరిపాలనను జీవీఎంసీ ద్వారా ఈ విశాఖ నగరానికి అందించాలని కోరుతూ మేయర్ ను విశాఖ ఎంపీ శ్రీభరత్ అభినందించారు.



### పెన్షన్లు పంపిణీ చేసిన భీమిలి ఎమ్మెల్యే గంటా

**విశాఖ ,మధురవాడ,మహా :** జీవీఎంసీ 4 వ పరిధిలోని మంగమారి పేట లో లబ్ధిదారులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇతర పథకాలు అందుతున్నాయా, లేదా అన్నది లబ్ధిదారులను ఆరా తీశారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాసి త్రినాధ్, గరికిన ఎల్లాజీ (కింగ్) పాల్గొన్నారు.

EDITORIAL
సంపాదకీయం

# స్వాతంత్ర్యానికి పూర్వం కులగణన

> దేశంలో చివరి సారిగా సమగ్ర కుల గణన జరిగింది 1931లో అంటే దాదాపు ఒక శతాబ్దం కిందట. అదీ అవిభక్త భారతదేశంలో అన్న మాట. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం, తర్వాత దేశం ముక్కలు కావడం. బంగ్లాదేశ్, పాకిస్తాన్ లతో అనేక పర్యాయాలు యుద్ధం జరగడం, అటు వారు ఇటు రావడం ఎన్నోసార్లు జరిగింది. ఇన్ని మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి.

> బ్రిటీష్ కాలంలో కుల గణన -అవసరాల కోసం బ్రిటీష్ వలసవాదులు భారతదేశాన్ని పాలించే క్రమంలో సామాజిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం, పరిపాలనా సౌలభ్యం,సైన్యం నియామకాలు,పన్నుల వసూలు వంటి వివిధ అవసరాల కోసం క్రమం తప్పకుండా జనగణనను నిర్వహించేవారు. 1881 నుంచే జనగణనలో కుల వివరాలను సేకరించడం ప్రారంభించారు. కులాన్ని ఒక ప్రధాన సామాజిక విభాగాలుగా గుర్తించి, వారి జనాభా, ఆర్థిక స్థితిగతులు, వృత్తులు వంటి వివరాలను నమోదు చేసేవారు.

కుల గణన... ప్రస్తుతం ఈ అంశంపై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది. నిన్నటి వరకు తెలంగాణకే పరిమితమైన కుల గణన నేడు దేశ వ్యాప్తంగా జరుగబోతోంది. కులాలవారిగా జనాభా లెక్కలు తీయడం వల్ల సామాజిక న్యాయం జరుగుతుందని కొందరు గట్టిగా వాదిస్తుంటే, మరి కొందరు ఇది సమాజాన్ని మరింతగా విభజిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేం కుల గణన చేసి చూపాం కాబట్టి దేశానికి మేం ఆదర్శంగా నిలిచామని కాంగ్రెస్ చెబుతుంటే దాదాపు 70 ఏళ్ళు దేశానికి పాలించారు, అప్పుడెందుకు ఈ ప్రక్రియను చేపట్టలేదని కాంగ్రెస్ బద్ధ వ్యతిరేకులు ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ మొత్తం చర్చలో ఒక కీలకమైన ప్రశ్న మాత్రం తలెత్తుతోంది. ఏది ఏమైనా ఎవరు కారకులైనా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తొలిసారి కుల గణన జరుగబోతుండటంతో కుల గణన అనేది చర్చనీయాంశంగా మారింది. దేశంలో చివరి సారిగా సమగ్ర కుల గణన జరిగింది 1931లో అంటే దాదాపు ఒక శతాబ్దం కిందట. అదీ అవిభక్త భారతదేశంలో అన్న మాట. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం, తర్వాత దేశం ముక్కలు కావడం. బంగ్లాదేశ్, పాకిస్తాన్ లతో అనేక పర్యాయాలు యుద్ధం జరగడం, అటు వారు ఇటు రావడం ఎన్నోసార్లు జరిగింది. ఇన్ని మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. జనగణన జరిగినప్పటికీ కులగణన జరగక పోవడానికి కారణం ఏమిటన్నది ప్రస్తుతం జరుగుతున్న చర్చలో ప్రధానాంశంగా మారింది. 1931 లో కులగణన జరిగితే ప్రస్తుతం 2025లో ఉన్నాం. అంటే దాదాపు 95 సంవత్సరాలు పూర్తయింది. నిర్ణయం తీసుకున్న మేరకు ఇప్పటికిప్పుడు కేంద్ర ప్రభుతక్వం జనగణనను ప్రారంభించినా దాదాపు ఏడాది కాలమైతే తప్పా ఇదమిద్ధంగా కులాల వారిగా జనాభా లెక్కలపై స్పష్టత వచ్చే అవకాశాలు లేవు,






- గడ్డం క్రిష్ణమూర్తి,
సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్

> ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్యం తర్వాత కులాన్ని పక్కన పెట్టాలన్న ప్రయత్నం మొదలైంది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశ విభజన గాయం ఇంకా మానలేదు. ఇలాంటి సమయంలో, దేశాన్ని ఏకీకృతం చేయడం, జాతీయ భావాన్ని పెంపొందించడం అత్యంత ముఖ్యం అని దేశ తొలి నాయకులు భావించారు.

> జనగణన అనేది దేశ భవిష్యత్ ప్రణాళికలకు, అభివృద్ధికి అత్యంత కీలకమైన డేటాను అందిస్తుంది. దీంట్లో కుల వివరాలను నమోదు చేయడం వల్ల కుల గుర్తింపులు మరింత బలోపేతమై, సమాజంలో విభజన తలెత్తుతుందని, జాతీయ ఐక్యతకు భంగం వాటిల్లుతుందని నాటి నాయకులు భావించారు. అందుకే, 1951 నుంచి జరగాల్సిన సాధారణ జనగణన నుంచి కుల వివరాల సేకరణను నిలిపివేశారు.

మరి అప్పటి నుంచి ఎందుకు కులగణన జరగలేదు? స్వాతంత్ర్యం సిద్ధించాక ప్రభుత్వాలు ఈ అంశంపై ఎలాంటి వైఖరిని అవలంబించాయి? దీని వెనుక ఉన్న కారణాలు, ఆశయాలు, రాజకీయాలు ఏమిటి..? బ్రిటీష్ కాలంలో కుల గణన అవసరాల కోసం బ్రిటీష్ వలసవాదులు భారతదేశాన్ని పాలించే క్రమంలో సామాజిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం, పరిపాలనా సౌలభ్యం ,సైన్యం నియామకాలు,పన్నుల వసూలు వంటి వివిధ అవసరాల కోసం క్రమం తప్పకుండా జనగణనను నిర్వహించేవారు. 1881 నుంచే జనగణనలో కుల వివరాలను సేకరించడం ప్రారంభించారు.కులాన్ని ఒక ప్రధాన సామాజిక విభాగాలుగా గుర్తించి, వారి జనాభా, ఆర్థిక స్థితిగతులు, వృత్తులు వంటి వివరాలను నమోదు చేసేవారు.1931 జనగణన చివరిసారిగా కుల వివరాలను సమగ్రంగా సేకరించింది. ఈ లెక్కల ఆధారంగానే అప్పట్లో పలు సామాజిక వర్గాలకు ప్రయోజనాలు కల్పించడం జరిగింది. వలస పాలకులకు ఇది ఒకరకంగా విభజించి పాలించు విధానానికి కూడా ఉపయోగపడిందని విమర్శ ఉంది. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్యం తర్వాత కులాన్ని పక్కన పెట్టాలన్న ప్రయత్నం మొదలైంది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశ విభజన గాయం ఇంకా మానలేదు. ఇలాంటి సమయంలో, దేశాన్ని ఏకీకృతం చేయడం, జాతీయ భావాన్ని పెంపొందించడం అత్యంత ముఖ్యం అని దేశ తొలి నాయకులు భావించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూతో పాటు చాలా మంది స్వాతంత్ర్య సమరయోధులు కులాన్ని ఒక సామాజిక రుగ్మతగా, దేశ ప్రగతికి, ఐక్యతకు ఆటంకంగా భావించారు. కుల వ్యవస్థ క్రమంగా బలహీనపడి, దేశం ఆధునికత వైపు అడుగులు వేయాలని వారు ఆకాంక్షించారు. అప్పటికే ప్రపంచంలోని చాలా దేశాలలో కులరహిత సమాజం సాగుతోంది. ఆయా దేశాలలో ప్రజల మధ్యఐక్యత, శాంతి తదితర అంశాలన్నింటినీ నాటి మన పెద్దలు పూర్తిగా పరిశీలించి కులరహిత సమాజం ఏర్పాటు వైపు అడుగులు వేశారు. ఈ ఆదర్శవాద దృక్పథంలోంచే కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. జనగణన అనేది దేశ భవిష్యత్ ప్రణాళికలకు, అభివృద్ధికి అత్యంత కీలకమైన డేటాను అందిస్తుంది. దీంట్లో కుల వివరాలను నమోదు చేయడం వల్ల కుల గుర్తింపులు మరింత బలోపేతమై, సమాజంలో విభజన తలెత్తుతుందని, జాతీయ ఐక్యతకు భంగం వాటిల్లుతుందని నాటి నాయకులు భావించారు. అందుకే, 1951 నుంచి జరగాల్సిన సాధారణ జనగణన నుంచి కుల వివరాల సేకరణను నిలిపివేశారు. అయితే, రాజ్యాంగపరంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రత్యేక రక్షణలు, రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వీరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం, వారి జనాభా ఆధారంగా నిధులు కేటాయించడం, రిజర్వేషన్లు అమలు చేయడం వంటి వాటికి కచ్చితమైన జనాభా లెక్కలు అవసరం. కాబట్టి, ఎస్సీ, ఎస్టీల జనాభా లెక్కలను మాత్రం ప్రతి జనగణనలోనూ సేకరించడం కొనసాగించారు. మిగిలిన కులాల వివరాలను మాత్రం వదిలేశారు. నెహ్రూ నాయకత్వంలోని ప్రభుత్వాలు ఆదర్శవాదంతో కులాన్ని పక్కన పెట్టాలని భావించినా, ఆచరణలో అది అంత తేలిక కాలేదు. భారతీయ సమాజంలో కుల వ్యవస్థ లోతుగా పాతుకుపోవడమే ఇందుకు కారణం. గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు, పట్టణాల్లోనూ, ప్రభుత్వ రంగంలోనూ,ప్రైవేట్ రంగంలోనూ కులం ప్రభావం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. పాశ్చాత్య పోకడలను పుణికి పుచ్చుకున్నప్పటికీ నేటికీ కుల వివక్ష కొనసాగుతూనే ఉంది. కుల ప్రాధాన్యత కనిపిస్తూనే ఉంది. విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు, సామాజిక స్థితిగతులు ఇప్పటికీ చాలా వరకు కులంతో ముడిపడి ఉన్నాయి.

1980లలో మండల్ కమిషన్ నివేదిక సమర్పించింది. 1990లలో ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాత పరిస్థితి మారింది. ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నా, వారి జనాభా ఎంత ఉందో కచ్చితంగా తెలియాలి. ఏయే కులాలు వెనుకబడ్డాయో గుర్తించాలి. ఇదంతా జరగాలంటే 1931 నాటి లెక్కలు ఆధునిక కాలానికి సరిపోవు. దీంతో ఓబీసీ జనాభా లెక్కల ఆవశ్యకత తీవ్రంగా తెరపైకి వచ్చింది. అప్పటి వరకు కులాన్ని విస్మరించాలనుకున్న ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో తమ వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. ఓబీసీ జనాభా లెక్కలపై పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, యూపీఏ ప్రభుత్వం 2011లో సామాజిక ఆర్థిక కుల గణనను నిర్వహించింది. ఇది కేవలం జనాభా గణన కాదు, కుల వివరాలతో పాటు సామాజిక, ఆర్థిక స్థితిగతులను కూడా సేకరించే ప్రయత్నం. అయితే, ఈ గణనలో సేకరించిన కుల డేటాను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయలేదు. డేటాలో పెద్ద ఎత్తున లోపాలున్నాయని, కచ్చితత్వం లేదని కారణాలు చూపింది. ఇది పెద్ద రాజకీయ దుమారానికి దారితీసింది. కుల డేటాను కావాలనే ప్రభుత్వం అణచివేస్తోందని అనేక పార్టీలు, సామాజిక వర్గాలు విమర్శించాయి. 2011లో నిర్వహించిన ఆర్థిక కులగణన అనుభవం తర్వాత సమగ్ర కుల గణన డిమాండ్ మరింత బలోపేతమైంది. అనేక ప్రాంతీయ పార్టీలు, ఓబీసీ సంఘాలు ఈ డిమాండ్‌ను తీవ్రతరం చేస్తూ వచ్చాయి. బీహార్ ప్రభుత్వం సొంతంగా రాష్ట్ర స్థాయిలో కుల సర్వే నిర్వహించడం ఈ డిమాండ్‌కు కొత్త ఊపునిచ్చింది. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం ప్రయోజనాలు, ప్రాతినిధ్యం లభించాలంటే కుల గణన తప్పనిసరి అని మద్దతు దారులు బలంగా వాదిస్తున్నారు. 1931లో కేవలం పాలనా అవసరాల కోసం మొదలైన కుల గణన, స్వాతంత్ర్యం తర్వాత దేశ ఐక్యత పేరుతో పక్కన పెట్టబడింది. ఆ తర్వాత సామాజిక వాస్తవాలు, రాజకీయ పరిణామాలు, మండల్ కమిషన్ అమలు వంటి కారణాల వల్ల కుల గణన అవశ్యకత మళ్ళీ తెరపైకి వచ్చింది. ఆదర్శవాదం నుంచి ఆచరణాత్మక అవసరాల వైపు ప్రభుత్వాల వైఖరి మారింది. దాదాపు ఒక శతాబ్దం తర్వాత, దేశం మళ్ళీ కుల గణన చేయాలా? వద్దా? దాని పర్యవసానాలు ఏమిటి? అనే దానిపై తీవ్రంగా ఆలోచించాల్సిన పరిస్థితిని తీసుకు వచ్చింది. ఇది ఆధునిక భారతదేశంలో కుల వాస్తవికతతో సాగుతున్న నిరంతర సంఘర్షణకు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యంపై జరుగుతున్న లోతైన చర్చకు అద్దం పడుతోంది. సమాజంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజల నుంచి వస్తున్న డిమాండ్, వివక్షలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై తలెత్తుతున్న విమర్శలు తదితర పరిణామాల నేపథ్యంలో కులగణన ద్వారానే సమాజంలో పెరుగుతున్న కొన్ని డిమాండ్లు పరిష్కరించేందుకు వీలవుతాయని కేంద్రం భావనకు వచ్చినట్లు స్పష్టమవుతోంది.

ఈ కులగణన ద్వారా కులాలను ప్రోత్సహించడం కంటే సమాజంలో పెరుగుతున్న అసమానతలను తొలగించడం సులభమవుతుందన్న భావనకు వచ్చినట్లు స్పష్టమవుతోంది. కులగణన తర్వాత భవిష్యత్ ఎలా ఉంటుంది, తద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారం ఏమిటన్నది ఇప్పటికి అప్రస్తుతం. కులగణనే చాలా సమస్యలకు పరిష్కారం చూపుతుందన్న భావన ప్రజల్లో నెలకొంది. దాదాపు 100 సంవత్సరాల తర్వాత తిరిగి కులగణనకు కేంద్రం సన్నద్ధమైంది. 2011 కులగణన మాదిరిగా కాకుండా త్వరలో జరుగబోయే కులగణన ద్వారానైనా అసలు కులాలు ఎన్ని, కులాల వారిగా జనాభా ఎంత, బడ్జెట్ లో ఆయా కులాల వాటా, ఏయే కులాలకు ప్రోత్సాహం లభించాల్సిన అవసరం ఉంది అన్న విషయాలతో పాటు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితులు కొలిక్కి వస్తే బాగుంటుంది.

> నెహ్రూ నాయకత్వంలోని ప్రభుత్వాలు ఆదర్శవాదంతో కులాన్ని పక్కన పెట్టాలని భావించినా, ఆచరణలో అది అంత తేలిక కాలేదు. భారతీయ సమాజంలో కుల వ్యవస్థ లోతుగా పాతుకుపోవడమే ఇందుకు కారణం. గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు, పట్టణాల్లోనూ, ప్రభుత్వ రంగంలోనూ,ప్రైవేట్ రంగంలోనూ కులం ప్రభావం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. పాశ్చాత్య పోకడలను పుణికి పుచ్చుకున్నప్పటికీ నేటికీ కుల వివక్ష కొనసాగుతూనే ఉంది. కుల ప్రాధాన్యత కనిపిస్తూనే ఉంది. విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు, సామాజిక స్థితిగతులు ఇప్పటికీ చాలా వరకు కులంతో ముడిపడి ఉన్నాయి.

> వెనుకబడిన వర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం ప్రయోజనాలు, ప్రాతినిధ్యం లభించాలంటే కుల గణన తప్పనిసరి అని మద్దతు దారులు బలంగా వాదిస్తున్నారు. 1931లో కేవలం పాలనా అవసరాల కోసం మొదలైన కుల గణన, స్వాతంత్ర్యం తర్వాత దేశ ఐక్యత పేరుతో పక్కన పెట్టబడింది. ఆ తర్వాత సామాజిక వాస్తవాలు, రాజకీయ పరిణామాలు, మండల్ కమిషన్ అమలు వంటి కారణాల వల్ల కుల గణన అవశ్యకత మళ్ళీ తెరపైకి వచ్చింది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# భారత్‌కు అమెరికా మిలిటరీ హార్డ్‌వేర్

## ఉద్రిక్తతల వేళ రూ.11 వేల కోట్ల డీల్‌కు పెంటగాన్ పచ్చజెండా

**మహా:** భారత్‌కు కీలకమైన సైనిక హార్డ్‌వేర్ సరఫరాతో పాటు లాజిస్టిక్ మద్దతును అందించేందుకు అమెరికా అంగీకరించింది. సుమారు రూ.11వేల కోట్ల (131 మిలియన్ డాలర్లు) విలువైన ప్రతిపాదనకు అగ్రరాజ్యం ఆమోదం తెలిపింది. అమెరికా రక్షణ శాఖ 'పెంటగాన్' పరిధిలోని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ ఇందుకు అనుమతులు మంజూరు చేసింది. దీనిపై అమెరికా కాంగ్రెస్‌కు కూడా సమాచారాన్ని అందజేసింది. ఇరుదేశాల మధ్యనున్న బలమైన ద్వైపాక్షిక సంబంధాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్‌సీఏ వెల్లడించింది. అమెరికా నుంచి సైనిక కొనుగోళ్లను మరింత పెంచాలని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై ఒత్తిడి పెంచుతున్న వేళ ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించడం గమనార్హం. భారత్‌కు అందనున్న సైనిక హార్డ్‌వేర్‌ల జాబితాలో సీ విజన్ సాఫ్ట్‌వేర్, రిమోట్ సాఫ్ట్‌వేర్, అనలిటిక్ సపోర్ట్ వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరికరాల నిర్వహణ, నిల్వ, పంపిణీకి ఉపయోగపడే సామగ్రి సైతం అమెరికా నుంచి భారత్‌కు అందుతుందని సమాచారం. దీనిపై భారత ప్రభుత్వ వర్గాలు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. "ఇండో పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాలలో రాజకీయ సుస్థిరత, శాంతి, ఆర్థిక వికాసాల నిర్వహణలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. భారత్ మాకు ముఖ్యమైన రక్షణరంగ భాగస్వామి. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలు ఉన్నాయి. భారత్ భద్రతను బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించే అంశానికి అమెరికా కట్టుబడి ఉంది. భారత్‌కు ఈ సైనిక సామగ్రిని సమకూర్చడం అనేది అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రత లక్ష్యాలతో ముడిపడిన అంశం" అని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ ఈసందర్భంగా వెల్లడించింది.

**హాక్ ఐ 360 కంపెనీ భారత్‌కు సప్లై**

"ఈ కీలక సైనిక సామగ్రిని విక్రయించడం వల్ల ప్రస్తుత, భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనేలా భారత నౌకాదళం సామర్థ్యం విస్తరిస్తుంది. శత్రులక్ష్యాలను ముందస్తుగా గుర్తించి, విశ్లేషించుకొని వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం చేకూరుతుంది. ఈ సామగ్రిని సైన్యంలో చేర్చుకునే విషయంలో భారత్‌కు ఎలాంటి అడ్డంకులూ లేవు. ఈ సామగ్రి వల్ల దక్షిణాసియా ప్రాంతంలో సైనిక సమతుల్యత దెబ్బతినదు. ఈ సైనిక సామగ్రిని వర్జీనియాలోని హెర్న్‌డాన్ ప్రాంతంలో ఉన్న హాక్ ఐ 360 కంపెనీ భారత్‌కు సప్లై చేయనుంది. భారత్‌కు ఈ సేల్ జరపడం వల్ల అమెరికా రక్షణ సన్నద్ధతకు ముప్పేం ఉండదు" అని డీఎస్‌సీఏ పేర్కొంది.



# పది ఫలితాల లో లార్డ్స్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల విద్యార్థుల ప్రభంజనం

■ అత్యుత్తమ ఫలితాలు సాధించడం లో మాకు మేమే పోటీ లార్డ్స్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల చైర్మన్ సిద్ధల బీరప్ప




**బాలాపూర్ మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల లో లార్డ్స్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పరీక్షలు ఏవైన ఫలితాలలో మేమే నెం.1 అనే విధంగా లార్డ్స్ విద్యార్థులు తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శిస్తూ ప్రభంజనం సృష్టించారని చైర్మన్ సిద్ధల బీరప్ప అన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ధరణి 600ల మార్కులకు గాను 581, పూజ577, హర్షిత577, కృపాలిని576, గోపిక572, వెంకట ప్రణీత్ కుమార్572, లాస్య570, తేజా నాయక్569, 566, 569, 566, 566, 566, 2566, 566, 564, 562, 2561, నిహారిక 560 అనే విద్యార్థులు 560 పైగా మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలిపారు. 34 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు, 143మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారి తల్లితండ్రులను పాఠశాల చైర్మెన్ సిద్ధాల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, సతీష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణం లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి చేయకుండా అనుభవజ్ఞులైన అధ్యాపకు బృందంచే పాఠశాలలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని వారి కున్న అనుమానాలను నిష్కృతి చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడం లో విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తామని తెలిపారు.

# కార్మిక వాడల్లో ఎగిరిన ఎర్రజెండా

■ కార్మికుల ఐక్యతకు నిదర్శనం మే డే
■ మే డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ






**వరంగల్ మహా ;** దేశానికి వెన్నెముక శ్రామిక శక్తియని, వారి అవిశ్రాంత, అంకిత భావానికి ఐక్యత, పోరాటాలకు గుర్తింపుగా కార్మిక దినోత్సవం నిలుస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని మే డే పురస్కరించుకొని వరంగల్ నగర పరిధి లక్ష్మీపురం మార్కెట్ లో ఘనంగా నిర్వహించిన మేడే వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రపంచ కార్మిక, కర్షక, శ్రామికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, ప్రవీణ్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు, మహిళలు, హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో తెలంగాణ ప్రజాప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం, తమ కుటుంబం కోసం కార్మికులు సాధించిన విజయాలు సహకారం మరిచి పోలేనిదని అన్నారు. కార్మికుడు తన చెమట చుక్కలను, రక్త మాంసాలను కరిగించి పని చేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుందని తెలిపారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని, చికాగోలో ఉన్న కొంత మంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజని, ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనమన్నారు. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్న పద్ధతిని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారని మంత్రి తెలిపారు. అంతకుముందు మంత్రి, కలెక్టర్ తో కలసి మార్కెట్ కలియతిరిగి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ కూరగాయల వ్యాపారులను ఆడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు కార్మిక విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని కార్మికులు మంత్రికి వినతి పత్రం అందించగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

# క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

■ వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, మహా ;** వేసవిలో ఉచిత క్రీడా శిబిరాలను చిన్నారులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను గురువారం జిల్లా కేంద్రంలోని ఓ సిటీ స్టేడియంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు తమకు నచ్చిన క్రీడా అంశాన్ని ఎంపిక చేసుకొని అందులో రాణించాలన్నారు. మే 1 నుండి జూన్ 6 వరకు జరిగే వివిధ క్రీడా అంశాల్లో కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పర్యవేక్షణలో మెలకువలు నేర్చుకొని ఆటలో రాణించాలన్నారు. అనంతరం శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 10 గ్రామీణ ప్రాంతాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడా శిక్షణలతో పాటుగా అర్బన్ (పట్టణ) ప్రాంతాలకు సంబంధించిన పిల్లలను కూడా క్రీడారంగంలో ప్రవేశం కల్పించి అటు శారీరకంగా ఇటు మానసికంగా దృఢంగా ఉండేలా తయారు కావాలనే ఉద్దేశంతో స్థానిక ఓ సిటీ స్టేడియంలో ఒలంపిక్‌లో గుర్తింపు ఉన్న ఖోఖో, క్రికెట్ తో పాటు జూడో క్రీడా అంశాల్లో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని, క్రీడల ద్వారా కలిగే ప్రయోజనాలు, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని కలెక్టర్ అన్నారు. వేసవి సెలవుల లో ఉన్న సమయాన్ని సక్రమమైన ప్రణాళికతో క్రీడలలో చేరాలన్నారు. ఈ సందర్భంగా అర్బన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల శిక్షకులకు క్రీడా సామగ్రిని జిల్లా కలెక్టర్ చేతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా యువజన క్రీడల అధికారి సత్య వాణి, తహసీల్దార్ ఇక్బాల్, ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్ యాదవ్,ఓయాసిస్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ పరంజ్యోతి , జెఎన్టీయు స్పోర్ట్స్ బోర్డ్ కన్వీనర్ దిలీప్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ సంజీవ్ , క్రీడాకారులు తల్లిదండ్రులు వాకర్స్ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయం పై హర్షం

## సీఎంకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్సీ



**వరంగల్, మహా ;** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం విజయవంతం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలనే నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కులగణనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, తెలంగాణ నమూనా దేశమంతా అమలుచేయాలని ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు పేర్కొన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య , ప్రభుత్వ సలహాదారులు కె కేశవ రావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యులు తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కులగణన లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవడమే కాకుండా కేంద్రం కూడా కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొంటు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య ముఖ్యమంత్రి ని కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం పట్టివేత



**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల తనిఖీలు చేపట్టారు. దుబాయ్ నుండి మస్కట్ మీదగా శంషాబాద్ వచ్చిన ప్రయాణికుని వద్ద మూడున్నర కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ఎయిర్పోర్ట్ సిబ్బందితో కలిసి బంగారాన్ని అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు డైరెక్టర్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు తెలిపారు. దుబాయ్ నుండి మస్కట్ మీదగా శంషాబాద్ వచ్చిన భారత ప్రయాణికుని ఇంటర్నేషనల్ ప్యాసింజర్ గేటు ఏరో బ్రిడ్జ్ దగ్గర అడ్డుకున్నారు. గ్రౌండ్స్ హ్యాండ్లింగ్ సిబ్బందితో కలిసి బంగారాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్టు గుర్తించిన అధికారులు. 30 బంగారు కడ్డీలు ఒక్కొక్కటి పది తులాలు ఉంటుంది. 3500 గ్రాముల బంగారాన్ని ఇంటెలిజెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 3,45,79300 వరకు ఉంటుందని అంచనా, కస్టమ్స్ చట్టం 1962 నిబంధనల ప్రకారం ప్రయాణికునితో పాటు సిబ్బందిని జ్యూడిషనల్ కష్టడికి పంపినట్లు అధికారులు తెలిపారు.

# అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



**రాజేంద్రనగర్ మహా:** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పాత సిద్ధాంతి ఏరియాలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు రావడంతో, గురువారం పోలీసుల బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులు ఐదు అంతస్తుల భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారి మనోహర్, బాబురావు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి కూల్చివేతలు చేపట్టారు. నేటి నుంచి శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ఏరియాలలో కూల్చివేతల స్పెషల్ డ్రైవ్ నిర్వహించబోతున్నమని తెలిపారు.

# కార్మికులతో కలిసి ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ



**రాజేంద్రనగర్ మహా :** మే డే సందర్భంగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో లేబర్ అడ్డ దగ్గర ఏఐటియుసి జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్రగిరి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నెపు ప్రభు, మండల అధ్యక్షులు రాజు, మండల కార్యదర్శి నరేష్, తదితరులు పాల్గొన్నారు.


# మే డే స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలి



**డోర్నకల్, మహా :** మరిపెడ మండలంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల్ వీరయ్య పాల్గొని ప్రసంగించారు. మే డే స్ఫూర్తితో హక్కులు నిలబెట్టుకోవడం కోసం అదనపు సౌకర్యాల కోసం మరింత ఉధృతంగా ఐక్య పోరాటాలు చేయడమే మన ముందున్న కర్తవ్యం ఒక కార్మిక వర్గ పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు కార్మిక హక్కుల కోసం నిలబడుతుందన్నారు. భారత దేశ కార్మికులు రానున్న కాలంలో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోబోతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం వచ్చి కార్మిక ఫాసిస్టు స్వభావంతో దాడి చేస్తుంది అన్నారు. ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు అన్ని తరగతుల ప్రజల జీవన విధానంలో జోక్యం చేసుకుంటున్నాయని.. భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులు ప్రజాస్వామ్యం లౌకికతత్వం స్ఫూర్తి దెబ్బతీస్తుందన్నారు ప్రధానంగా రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు పని హక్కు సమిష్టి తత్వం నీరుగారు స్తుందని మత.సామరస్యాన్ని దెబ్బతీసి కార్మిక వర్గంలో చీలికలు తీసుకువచ్చి పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగిస్తుందని. ఈ నేపథ్యంలో మేడే సందర్భంగా పలు అంశాలను పరిశీలించాలని అన్నారు మేడే అంటే అందరికీ గుర్తుకొచ్చేది ఎనిమిది గంటల పని విధానం కోసం జరిగిన పోరాటం అన్నారు. ఆనాడు 1886 మే 1 నుండి 4వ తేదీ వరకు చికాగో నగర నా ఎనిమిది గంటల పని కోసం కార్మికులు పోరాడుతుంటే పోలీసు కాల్పులు బాంబు దాడులు నాయకుల ఉరీ తీతలతో ఎరుపెక్కిన ఎర్రజెండా విశ్వవ్యాప్తంగా ప్రతిఘటన పోరాటలు తీవ్రం చేసింది 8 గంటల పని దినం సాధించుకుందన్నారు.

# దండే సురేష్ మృతి పార్టీకి తీరనిలోటు

■ బీఆర్ఎస్ యువ నాయకులు వై రవీందర్ యాదవ్
■ సురేష్ కుటుంబానికి అండగా ఉంటాం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సురేష్ పార్థీవ దేహానికి బీఆర్ఎస్ యువ నాయకులు వై రవీందర్ యాదవ్ ఘన నివాళులు అర్పించారు. షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దండే సురేష్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువనాయకులు వై రవీందర్ యాదవ్ వారి స్వగృహానికి వెళ్ళి, పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సురేష్ మృతి పార్టీకి తీరనిలోటు అని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు గణేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, నాయకులు జమాల్ ఖాన్, సాజిద్, నరేష్, పర్వేజ్ తదితరులు ఉన్నారు.

# రెపరెపలాడిన కార్మికుల ఎర్రజెండా



**వరంగల్, మహా;** మేడే స్ఫూర్తితో కార్మికులు నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం ఐకమత్యంగా పోరాడాలని సీఐ టీ యూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం. సాగర్ పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా రంగశాపేట వరంగల్, సంగెం మండల కేంద్రంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ పాలనలో కాపాడుకోవలసిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను దొడ్డిదారిలో ఆమోదించుకొని అమలు చేయాలనే ఆలోచనలో ఉందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకురావడం యాజమాన్యాల కొమ్ము కాయడమేనని అన్నారు. లేబర్ కొడ్స్ అమలయితే కార్మికులు సంఘం పెట్టుకోవడానికి సమ్మె చేయడానికి హక్కులు కఠినతరం అవుతాయన్నారు.లేబర్ కోడ్స్ రద్దు కోసం దేశవ్యాప్తంగా అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20 న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ నాయకులు రవి కుమార్, సాయిలు, రఘుపతి, స్వప్న, యాకయ్య , డీ రాజు శ్రీనివాస్ బాబు, స్వామి పాల్గొన్నారు.

# డంపు యార్డ్ తరలింపు కోసం నిరసన ర్యాలీ




**కరీంనగర్, మహా :** డంపు యార్డ్ ను వెంటనే తరలించాలని డిమాండ్ కరీంనగర్ పట్టణం కోతి రాంపూర్ లోని అలకాపురి కాలనీ వాసులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఇట్టి ర్యాలీ ఎన్టీఆర్ విగ్రహం నుండి కోతిరాంపూర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఆటో నగర్ లో ఉన్న డంప్ యార్డ్ మా ప్రాంతానికి శాపంగా మారిందన్నారు . డంపు యార్డులో ప్లాస్టిక్, రబ్బర్ అంటించడం వలన రోజు వెలుబడే విష వాయువులతో చుట్టుపక్కన ఉన్న పది కాలనీల్లో చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీ మహిళలు శ్వాసకోశ ఇబ్బందులతో, చర్మ వ్యాధులతో నిరంతరం బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాంపూర్ ప్రజల జీవనానికి సమస్యగా మారిన డంప్ యార్డ్ ను తక్షణం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నుండి తరలించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే. రేసైక్లింగ్ మెషిన్స్ ద్వారా పునరుత్పత్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ , మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి మా బాధలను అర్థం చేసుకొని వెంటనే డంప్ యార్డ్ తొలగింపు కోసం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. డంపు యార్డ్ తో తాము పడుతున్న ఇబ్బందులను, సమస్యలను , బాధలను పట్టించుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇట్టి నిరసన కార్యక్రమంలో అల్కాపురి కాలనీ ప్రజల తో పాటు పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జూన్ 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**కరీంనగర్, మహా :** చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం అన్నారు. మే డే పురస్కరించుకొని ఈరోజు స్థానిక లేబర్ అడ్డ, IML డిపో వద్ద CITU జెండా ఆవిష్కరణ చేసి మేడే ఘనంగా నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం మాట్లాడుతూ గతంలో బ్రిటిష్ వాళ్ళు పన్నుల రూపంలో కార్మికులను ప్రజలను దోచుకుంటే, నేడు బిజెపి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల పొట్ట కొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు స్వాతంత్రం సిద్ధించి 80 సంవత్సరాలు కావస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు. నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 20న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని ప్రజలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు గాజుల సతీష్, దాసరి తిరుపతి తోట రవి, బిల్డింగ్ వర్కర్స్ లేబర్ అడ్డ వద్ద అధ్యక్ష కార్యదర్శులు మల్లారెడ్డి, జగదీష్,లింగారెడ్డి, సిఐటియు నాయకులు రాజయ్య, కొత్త మహేందర్, కాసు రవి, పెంచాలా రవి, మల్లేష్,చేతన్,రాజేష్, రాపల్లి సురేష్, కటుపూరు శ్రీను, జన్వాల మధుకర్, గుంటిహరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ విద్యార్థులను అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు



**కాటారం, మహా :** పదవతరగతిలో అగ్రశ్రేణి ఫలితాలు సాధించిన మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ విద్యార్థులను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం అభినందించారు. 574 మార్కులు సాధించిన సిరిచందన, సాయిచరణ్య 565, అమూల్య 558 లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి శాలువాతో సన్మానించి, అభినందించారు. పదో తరగతిలో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆదర్శ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా

**వరంగల్ మహా ;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట టౌన్, వర్ధన్నపేట, ఐనవోలు మండలాల పరిధిలోని 87 మంది లబ్ధిదారులకు 27లక్షల 50వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమని గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే, ఎంపిల కార్యాలయాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని నేడు లబ్ధిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట టౌన్, వర్ధన్నపేట, ఐనవోలు మండలాల పరిధి లోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర, జిల్లా, మండల టౌన్ గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



## వర్షా కాలంలోపు బాక్స్ డ్రైన్ పనులు పూర్తి చేయాలి

- ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్
- హయత్ నగర్, ఉప్పల్, ఎల్బీనగర్ సర్కిళ్లలో అభివృద్ధి పనుల పరిశీలన
- సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**ఎల్బీనగర్,మహా :** ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలో వచ్చే వర్షాకాలంలోగా ముంపు సమస్య తీరేలా బాక్స్ డ్రైన్ పనులు పూర్తి చేయాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు తీసుకున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఎల్బీనగర్జోనల్ పరిధిలోని హయత్నగర్, ఎల్బీనగర్, ఉప్పల్సర్కిళ్లలో తొలిసారిగా పర్యటించారు. గురువారం ఉదయం హయత్నగర్ సర్కిల్ పరిధిలోని నాగోల్ డివిజన్ లోని సాయినగర్ నుంచి ఆర్టీఏ ఆఫీస్ వరకు జరుగుతున్న 350 మీటర్ల స్మార్ట్ వాటర్ బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలోపు బాక్స్ డ్రైన్ పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బాక్స్ డ్రైన్ నిర్మాణంతో లోతట్టులో ఉన్న కాలనీల్లో ముంపును నివారించవచ్చు అని ఈఈ రమేశ్బాబు వివరించారు. అనంతరం బైరామల్ గూడ ఫ్లై ఓవర్ కింద వివిధ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వీలుగా 6 బ్లాక్ ల్లో చేపట్టే స్పోర్ట్స్ బ్లాక్ లను కమిషనర్ పరిశీలించారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కు సూచించారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా నుంచి ఎస్ఆర్డీపీ ఫ్లైఓవర్ పనులతో పాటుగా.. నేషనల్ హైవే ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. ఉప్పల్ నుంచి నారపల్లి సీపీఆర్ఐ వరకు ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, మెయింటెనెన్స్ ఈఈలు కార్తీక్, రమేశ్బాబు, డిప్యూటీ కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, ఆంజనేయులు ఉన్నారు.

## ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చూడాలి

- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశం
- పది సంవత్సరాలుగా పార్టీ జెండాను మోస్తున్నాం
- అధికారమొచ్చిన ఫలితం శూన్యం కార్యకర్తలు
- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోవేదన
- ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రజల వద్దకు తీసుకెళ్లాలి
- ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చూడాలి
- కార్యకర్తల వాళ్లే పార్టీ బలంగా ఉంటుంది
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- కార్యకర్తల సమస్యలను అధిష్టానానికి విన్నవిస్తా
- సిడబ్ల్యుసి సభ్యులు వంశీచందర్ రెడ్డి
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని నినాదాలు





**రంగారెడ్డి, రాజేంద్రనగర్ మహా:** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కేఎల్సిసి ఫంక్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశం లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కిగౌడ్, సిడబ్ల్యుసి సభ్యులు వంశీచందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్య నాయకుల సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి జిల్లా నుంచి రాష్ట్ర క్యాబినెట్లో స్థానం కల్పించాలని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాకు ఉన్న ప్రాధాన్యత తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుసు, రాష్ట్రంలో ఏ ప్రభుత్వము ఏర్పాటు అయిన రంగారెడ్డి జిల్లా భూములను అమ్ముతూ పరిపాలన సాగిస్తున్నారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీనాయకులు పడుతున్న కష్ట నష్టాలను జిల్లా మంత్రికి చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లా మంత్రి లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశంలో వాపోయారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని కోరారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ... పది సంవత్సరాల నుంచి పార్టీ జెండాను మోస్తున్న కార్యకర్తలకు నాయకులకు ముందుగా అవకాశం లభిస్తుందని అన్నారు. పార్టీ పదవులునామినేట్ పోస్టులు 50 శాతం వారికి లభిస్తాయి. కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు, పాత కాంగ్రెస్ పార్టీ నాయకులను వదిలేసి వారితో వచ్చిన నాయకులకే నామినేట్ పోస్టులు పార్టీ పదవులు ఇస్తున్నారు. మీ సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తెలియజేస్తానని ఆయన తెలిపారు. సిడబ్ల్యూసి సభ్యులు వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కష్టపడ్డ వారికి అవకాశం లభిస్తుందని అన్నారు. జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎవరైతే పార్టీ కోసం కష్టపడతారు వారిని అధిష్టానం గుర్తించి స్థానిక సంస్థ ఎన్నికలలో వారికి ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని, ఆరు గ్యారెంటీలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలి. వీటిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దృష్టి సారించాలి, ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి. పార్టీకి సేవ చేస్తున్న ప్రతి నాయకుని, కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం కొనసాగుతుందని, ప్రజా పాలనలో ప్రజలే పాలకులుగా కొనసాగుతారని అన్నారు. ప్రజల కోసం ఏర్పడిన ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువచ్చి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తుందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని ఈ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీకి అండగా ఉండి, పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థలలో గెలుపుకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. సమావేశంలో కాసేపు గందరగోళం. సమన్వయం పాటించాలని వేడుకున్నా, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డి. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీ తో ఓడిన కిచ్చన్న లక్ష్మారెడ్డి, స్టేజి బ్యానర్ పై ఫోటో లేకపోవడంతో ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఇష్టానుసారంగా మాట్లాడొద్దని శివసేన రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో లోటుపాట్లు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సమావేశం పెట్టింది కార్యకర్తల నాయకుల కోసమని, మీకు ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడకూడదని అన్నారు. జిల్లా సమావేశ అనంతరం నియోజకవర్గ సమావేశాలు ఉంటాయి, మండల స్థాయి సమావేశాలు ఉంటాయని శివసేన రెడ్డి తెలిపారు.

## వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా

**చర్ల, మహా ;** మేడే సందర్భంగా చర్ల మండలంలోని వాడవాడలా ఎర్రజెండాను ఎగురవేశారు. సీపీఐ గ్రామ శాఖలలో ,కార్మిక అడ్డాలల చర్ల మండల కేంద్రంలో సిపిఐ ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాలు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, హమాలీ వర్కర్స్ యూనియన్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్,సీపీఐ, ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. మొదటగా సిపిఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినటువంటి అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ ఎగరవేశారు అనంతరం ఏఐటియుసి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గుంజి మాల్యాద్రి ఏఐటియుసి పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం చర్ల బస్టాండ్ సిపిఐ మండల కార్యదర్శి నూక పోతయ్య, అంబేద్కర్ సెంటర్లో పింగళి రాము,సూపర్ బజార్ సెంటర్లో సాయిల తిరుపతిరావు ఎగరవేశారు.అనంతరం. మెయిన్ సెంటర్లో రవి ఏక య్య , తిప్పాపురంలో నూప మోతిర్, పెద్ద ముసిలేరులో పాలవంచ రామారావు ఎగరవేశారు. నాయక కొత్తూరు, బెస్త కొత్తూరులో. పాలెం సత్యనారాయణ. మునిగిల రామారావు,తేగడలో కోడి రెక్కల రాజారావు,వాసం నాగేశ్వరావు ఎగరవేశారు. కుదునూరులో కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, కలివేరులు నాని పెళ్లి భద్రం, మల్లం నాగేశ్వరరావు, ఉప్పులూరు రాంబాబు లు ఎగరవేశారు.

## ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు



**తొర్రూర్ మహా :** కార్మికుల దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గురువారం తొర్రూరు పట్టణంలో మేడే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి కూరగాయల మార్కెట్ వరకు డప్పు చప్పులతో టపకాయలను కాలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు కార్మికులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని కార్మికుల ఐక్యతను చాటారు కార్మికుల శక్తి శ్రమకు గౌరవం ఇవ్వాలి అంటూ నినాదాలతో ర్యాలీని ముందుకు నడిపారు. అనంతరం మార్కెట్ ప్రాంతంలో కార్మికులు జెండా ఆవిష్కరణ చేసినారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ వారికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత శ్రమకి తగిన గౌరవం లభించాలి. వృద్ధి లక్ష్యాల్లో కార్మికుల పాత్ర ఎనలేనిది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇస్తుందని వారి సమస్యలకు అండగా ఉంటామని పేర్కొన్నారు కార్మికులు దేశ నిర్మాణంలో తమ వంతు పాత్రను నిబద్ధతతో పోషిస్తున్నారు. అయితే, ఈ రోజుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తగిన వేతనాలు భద్రత న్యాయమైన ఉద్యోగ ప్రమాణాలు ఇవ్వడం మా ప్రభుత్వం పని అని పేర్కొన్నారు వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుంది. కార్మికుల హక్కులు కాపాడేందుకు ప్రతి స్థాయిలో పోరాడతాం అని తెలిపారు ఈ కార్యక్రమంలో పట్టణ మండల అధ్యక్షులు స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన నేతలు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అంతటా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి మేడే జిందాబాద్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ ఆమనగల్ మండల కేంద్రం, శ్రీశైలం జాతీయ రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు జెండా ఎగరవేయడం జరిగింది. అనంతరం సిపిఎం ఆమనగల్ నాయకులు పిప్పళ్ళ శివశంకర్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, మేడే జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ... శ్రీకాకుళంలో ఎర్రగుడ్డలతో రక్తపు ముద్దలతో ఏర్పడిన జెండా ఎర్రజెండా అంటూ కార్మికులకు కనీస వేతనం, రోజుకు ఎనిమిది గంటల పని దినం కోసం పోరాటాలు చేసే సాధించుకున్నామని తెలిపారు. ఆమనగల్ మున్సిపాలిటీ కార్మికులు కనీస వేతనం అమలు చేయకుండా, మున్సిపాలిటీని ప్రతిరోజు ఉదయం కార్మికులు శుభ్రంగా ఉంచుతున్నారు. కానీ కార్మికులకు మాత్రం సుప్రీంకోర్టు చెప్పినట్టు ఒక కుటుంబం బతకాలంటే 24 వేల వేతనం ఇవ్వాలని కోర్టు చెబుతున్న ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు కార్మికుల పట్ల ఆలోచించి వారికి కనీస వేతనం 24 వేల రూపాయలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాపిశెట్టి రాము మాట్లాడుతూ... మున్సిపాల్టీ కార్మికులు వారికి అనేక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం 24 వేల రూపాయలు ఇవ్వాలని, మేడే వర్ధిల్లాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఇవ్వాలని, వాళ్ళ ఆరోగ్యాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీ కార్మికులు యాదమ్మ, మల్లయ్య నాయక్, రాములు, విజయ్, గ్రామపంచాయతీ నాయకులు పాండు, మధ్యాహ్నం భోజనం పలువురు పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రజలకు అందుబాటులో పోస్ట్ ఆఫీస్

- నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** మంచిరేవులలో నూతన పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ ప్రారంభించారు. నార్సిగి మున్సిపాలిటీ పరిదిలోని మంచిరేవులలో పాత గ్రామపంచాయతి కార్యాలయం సమీపంలో నూతన పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వృద్ధులకు, వితంతులకు, సామాజిక పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిరేవులలో పోస్ట్ ఆఫీస్ శాఖ ఏర్పాటు చేయడం అర్శించదగ్గ విషయమని అన్నారు. పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రజలు ఎన్నో సేవలను పొందవచ్చు అన్నారు. ఈ కార్యాలయం నర్సింగ్ మున్సిపాలిటీ ప్రజలకు అందుబాటులో రావడం చాలా మంచి పరిణామం, ప్రజలు ఈ యొక్క శాఖను వినియోగించుకోవాలని తెలిపారు. పోస్ట్ ఆఫీస్ లో పేద ప్రజలకు డబ్బులను జమ చేసుకునే విధంగా అనేక సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ ఆఫీస్ సిబ్బంది, ప్రజలు, పలువురు పాల్గొన్నారు.

## జనగణన కులగణన మోడీ నిర్ణయం చారిత్రాత్మకం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బీసీలకు రాబోయే జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించడం పట్ల ఆమనగల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రానున్న జనాభా లెక్కల్లో భాగంగా కులగణనను చేపట్టాలని రాజకీయ వ్యవహారాలపై కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆమోదించినట్టు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకునేందుకు దోహదపడుతుంది. సమగ్ర అభివృద్ధి కోసం లక్ష్యమైన విధానాలను రూపొందించేందుకు ఇది మార్గం వేస్తుంది. ఇంత గొప్ప, సమానత్వాన్ని నెలకొల్పే నిర్ణయానికి గాను మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నాను. యావత్ దేశ వ్యాప్తంగా ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కారం దిశగా తీసుకెళ్తూ, అన్ని వర్గాలకు ప్రభుత్వ ఫలాలను అందిస్తున్న మోడీ, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఎస్సీ ఎస్టీ బీసి లకు ఇప్పటికే అనేక రకాలైన ప్రయోజనాలు కలిగే విధంగా రిజర్వేషన్లు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, బీసీల పట్ల కేంద్రం తన నిబద్ధతను చాటి చెప్పిందన్నారు. రాబోయే రోజుల్లో బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి 100% ఎస్సీ ఎస్టీ బీసీలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

## కోహెడలో భగ్గుమన్న భూ వివాదం

- ప్లాట్స్ ఓనర్స్ పై కత్తులు, గొడ్డళ్లతో దాడికి దిగిన భూ యజమాని
- నలుగురు భూ యజమానులకు తీవ్ర గాయాలు
- ఇరువర్గాల పరస్పర ఫిర్యాదులతో కేసు నమోదు
- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ కోహెడలో ఘటన



**ఎల్బీనగర్,మహా :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడలో భూ వివాదం బగ్గుమంది.గత కొంత ప్లాట్ ఓనర్స్,భూ యజమాని మధ్య జరిగిన వివాదంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 951,952 లో 7.28ఎకరాల భూమి గురించి ప్లాట్స్ ఓనర్స్,సంరెడ్డి బాల్ రెడ్డి అనే ఇరు వర్గాల మధ్య గత కొంత కాలంగా వివాదం జరుగుతుంది. ఇదే భూమిలో 1970లో వెంచర్ ఏర్పాటు సమయంలో భూ యజమానులు కంగుల రాములు,కంగుల పోచయ్య మరికొంత మంది కుటుంభ సభ్యులు కలిసి కంగుల గండయ్య,ఈదయ్యలకు సాధారణ పవర్ అటార్నీ(జీపీఏ) ఇచ్చారు.గండయ్య ఈదయ్యలు 1970లో వెంచర్ వేసి 170 ప్లాట్లను విక్రయించారు. కొద్ది సమత్సరాల తర్వాత మొదట జీపీఏ ఇచ్చిన కంగుల కుటుంభ సభ్యులకు సంబంధించిన కొంతమంది వారు ఇచ్చింది చట్టబద్ధమైన జీపీఏ కాదని ఆ భూమిని 2013 సంరెడ్డి బాల్ రెడ్డికి విక్రయించారు.ఆ తర్వాత 2014 నుండి ఆ వెంచర్ లో ప్లాట్ లు కొనుగోలు చేసిన ప్లాట్స్ యజమానులకు ఆ భూమిని కొనుగోలు చేసిన సంరెడ్డి బాల్ రెడ్డి కి మధ్య వివాదం కొనసాగుతుంది.ఈ విషయంలో ప్లాట్ ఓనర్స్ 2015లో రంగారెడ్డి జిల్లా కోర్టులో వీరికి గత మార్చ్ 28న డిక్రీ వచ్చింది.కాగా ఇదే భూమిలో సంరెడ్డి బాల్ రెడ్డి గత యాడాది నుండి ఓ ఫార్మ్ హౌజ్ నిర్మిస్తుండగా గత ఫిబ్రవరిలో ప్లాట్స్ ఓనర్స్ ఫిర్యాదుతో హైడ్రా అధికారులు ఫార్మ్ హౌజ్ లోని కొంత బాగాన్ని కూల్చివేశారు.దీంతో బాల్ రెడ్డి హై కోర్టు నుండి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాడు.పోలీసులు,హైడ్రా అధికారులు ఆ భూమిలోకి వెళ్లకుండా నాట్ టు ఇంటఫియర్ ఆర్డర్ ను గత ఫిబ్రవరిలో బాల్ రెడ్డి తీసుకువచ్చాడు.మార్చ్ 28న ప్లాట్స్ ఓనర్స్ కు అనుకూలంగా డిక్రీ రావడంతో వారు ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు గురువారం ప్లాట్స్ అక్కడికి చేరుకున్నారు.ఆ పక్కన తమ ప్లాట్ లను ప్లాట్స్ ఓనర్స్ క్లీన్ చేసుకుంటుండగా అక్కడికి సంరెడ్డి బాల్ రెడ్డి, సంరెడ్డి దిలీప్ రెడ్డి,శీలం శ్రీను మరొక వ్యక్తి అక్కడికి వచ్చారు. ప్లాట్స్ ఓనర్స్ తో వాగ్వాదానికి దిగడంతో అక్కడున్న ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇదే సమయంలో ప్లాట్స్ ఓనర్స్ పై బాల్ రెడ్డి కత్తి, గొడ్డలి,రాళ్ళతో దాడి చేశాడు.దీంతో అక్కడ ఉన్న మరికొందరు ప్లాట్స్ ఓనర్స్ తిరగబడ్డారు.దీంతో ఇరు వర్గాలకు గాయాలు అయ్యాయి. ప్లాట్ ఓనర్ సత్యనారాయణ తలపై తీవ్ర గాయాలు అయ్యాయి.నవీన్,వెంకట్ అనే ఇద్దరికి గాయాలు అయ్యాయి. దీంతో ప్లాట్స్ ఓనర్స్ హయత్ నగర్ పీఎస్ లో ఫిర్యాదు చేశారు.తమకు కూడా గాయాలు అయినట్లు బాల్ రెడ్డి పీఎస్ లో ఫిర్యాదు చేయడంతో ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇది ఇలా ఉండగా తాము కష్టపడి కొనుక్కున్న ప్లాట్స్ లలో ఇలా ఆక్రమాదారులు నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు.పోలీసులు బాల్ రెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.పోలీసుల ముందే తమపై దాడి చేస్తుంటే చూస్తునున్నారని తెలిపారు. పోలీసులు మాత్రం అక్కడ తనకు నాట్ టు ఇంటఫియర్ ఆర్డర్ ఉందని తమకు ప్లాట్స్ ఓనర్ ల నుండి రక్షణ కొరకై ఎలాంటి లీగల్ పత్రాలు రాలేదని చెప్పారు.ప్లాట్స్ ఓనర్స్ కూడా గౌరవ హై కోర్టు న్యాయస్థానం ఉత్తర్వ్యులను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.

## ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- సప్లమెంటరీ లో 100% ఉత్తీర్ణత సాధించాలి
- గత పది యేండ్లుగా ఫెయిల్ అయిన విద్యార్థులు డాటా సేకరించాలి
- అందరూ పరీక్ష రాసేలా చూడాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, మహా :** పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి సప్లమెంటరీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు. పదవ తరగతి ఫలితాలు, విద్యాశాఖలో భవిష్యత్తు కార్యాచరణ పై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన 6,200 మంది విద్యార్థుల్లో 5995 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫెయిల్ అయిన 205 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వచ్చే నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అదేవిధంగా 2015 నుండి ఇప్పటివరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల డాటా సేకరించాలన్నారు. ఇప్పటివరకు ఉత్తీర్ణత సాధించలేని, పరీక్ష ఫీజు చెల్లించకుండా ఉండిపోయిన వారి వివరాలు సేకరించి వారందరితో పరీక్ష ఫీజు చెల్లించేలా చూడాలని అన్నారు. ఫెయిల్ అయిన సబ్జెక్టుల్లో ప్రాక్టీస్ చేయించి వారంతా రానున్న సప్లమెంటరీలో పాస్ అయ్యేలా, ఉన్నత చదువు కొనసాగించేందుకు అవకాశం వచ్చేలా చూడాలని అన్నారు.

రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. ఈ ఏడాది పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 96.69 శాతం మంది ఉత్తీర్ణత సాధించిన విషయాన్ని వారికి తెలియజేయాలని అన్నారు. మండల విద్యాధికారులు అన్ని పాఠశాలలను సందర్శించి అక్కడ కావలసిన సౌకర్యాల నివేదికను సమర్పించాలని అన్నాను. విద్యార్థులు తక్కువ, ఎక్కువ ఉన్న పాఠశాలలను గుర్తించి ఫర్నిచర్ సర్దుబాటు చేయాలని సూచించారు. ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీలు భవిత కేంద్రాలను తక్కువ విద్యార్థులు ఉండి గదులు ఖాళీగా ఉన్న పాఠశాలలోకి మార్చాలని ఆదేశించారు. వీలైనన్ని అంగన్వాడీలను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. భవిత కేంద్రాల ఆధునీకీకరణ పనులను, సమ్మర్ క్యాంపులను పర్యవేక్షించాలని ఎంఈఓ లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, కోఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్ ఆంజనేయులు, డిసిడిఓ కృపారాణి, సిడిపిఓలు సబితా శ్రీమతి పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**జనగామ మహా;** జనగామ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి చెందిన బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండి చనిపోయిన కార్యకర్త కుటుంబానికి 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందచేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్త పార్టీ కుటుంబ సభ్యులే అని వారు ఇబ్బంది పడకూడదని ముందు చూపుతో కెసిఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా వారికి ఇన్సూరెన్స్ కల్పించి అండగా నిలిచిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. గురువారం పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన పిండి యాకయ్య కుటుంబానికి గురువారం 2 లక్షల రూపాయలు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## బంగారం డోర్ డెలివరీ.. సెక్యూరిటీ చూశారా?




కాదేదీ డోర్ డెలివరీకి అనర్హం అన్నట్లు ఆర్డర్ ఇస్తే చాలు ఇప్పుడు ప్రతీదీ ఇంటి ముంగిటకే వచ్చేస్తోంది. ఈ ఏడాది అక్షయ తృతీయను పురస్కరించుకుని ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్ నిత్యావసర సరుకుల మాదిరిగానే బంగారాన్నీ డెలివరీ చేస్తామంటూ ముందుకు వచ్చింది. అయితే డోర్ స్టెప్ గోల్డ్ డెలివరీ కోసం ఆ కంపెనీ చేసిన హై సెక్యూరిటీ ఏర్పాట్లకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఆన్ లైన్ లో చక్కర్లు కొడుతున్న వరుస వైరల్ వీడియోలు నెటిజనుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా విస్తృతంగా షేర్ అవుతున్న ఒక వీడియో క్లిప్‌లో స్విగ్గీ డెలివరీ ఎగ్జిక్యూటివ్.. సెక్యూరిటీ గార్డుతో కలిసి ట్రాఫిక్‌లో బైక్‌పై వెళ్తూ కనిపించారు. అందులో సెక్యూరిటీ గార్డు ఒక చేతిలో లాఠీ, మరో చేతిలో హై సెక్యూరిటీ లాకర్ పట్టుకొని కనిపించాడు. ఈ వీడియో వీక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. "ఏమి జరుగుతోంది?" అంటూ ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్ ప్రశ్నించగా "రియల్ గోల్డ్ డెలివరీ కర్నే కే లియే రియల్ సెక్యూరిటీ చాహియే బ్రో (రియల్ గోల్డ్ కోసం రియల్ సెక్యూరిటీ కావాలిగా) అని స్విగ్గీ చమత్కారంగా బదులిచ్చింది. ఆన్ లైన్ లో ప్రచారం ఊపందుకోవడంతో స్విగ్గీ ఇన్ స్టామార్ట్ తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్ లో వైరల్ వీడియోలను రీపోస్ట్ చేసింది. దీనికి బంగారమా? నిజంగానా?' అంటూ మరో యూజర్ ఆశ్చర్యం వ్యక్తం చేయగా దీనికి కూడా 'డెలివరింగ్ సోనా ఇన్ ఎవరీ కోనా కోనా'(ప్రతి మూలకూ బంగారం డెలివరీ) అంటూ స్విగ్గీ రిప్లయి ఇచ్చింది. కాగా కల్యాణ్ జ్యువెల్లర్స్ నుంచి వివిధ బరువుల బంగారు, వెండి నాణేలను నిమిషాల్లో కస్టమర్లకు డెలివరీ చేయనున్నట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. క్విక్ కామర్స్ సర్వీస్ ద్వారా లభించే నాణేలలో 0.5 గ్రాములు, 1 గ్రాము బంగారు నాణేలు, అలాగే 5 గ్రాములు, 10 గ్రాములు, 20 గ్రాముల వెండి నాణేలు ఉన్నాయి.

## లాభాల బ్యాంకులు..

### ఫెడరల్ బ్యాంక్ లాభం ప్లస్.. బంధన్ బ్యాంక్ లాభం దూకుడు




ప్రయివేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 1,091 కోట్లను తాకింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం వృద్ధితో రూ. 2,377 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 33 శాతం జంప్‌చేసి రూ. 1,006 కోట్లయ్యింది. నికర వడ్డీ మార్జిన్లు 3.21 శాతం నుంచి 3.12 శాతానికి స్వల్పంగా నీరసించాయి. తాజా స్లిప్పేజీలు రూ. 352 కోట్ల నుంచి రూ. 483 కోట్లకు పెరిగాయి. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 1.94 శాతం నుంచి 1.84 శాతానికి దిగిరాగా.. కనీస మూలధన నిష్పత్తి 16 శాతానికి చేరింది. కాగా.. క్యూ4లో స్టాండెలోన్ నికర లాభం రూ. 906 కోట్ల నుంచి రూ. 1,030 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 3.3 శాతం పతనమై రూ. 197 వద్ద ముగిసింది. మరో ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 6 రెట్లు దూసుకెళ్లి రూ. 318 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 55 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,890 కోట్ల నుంచి రూ. 6,133 కోట్లకు ఎగసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 2,745 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 21,041 కోట్ల నుంచి రూ. 24,915 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 1.3% నీరసించి రూ. 166 వద్ద ముగిసింది.




## రికార్డ్ స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

గడిచిన నెలలో ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు రికార్డ్ స్థాయిలో వచ్చాయి. ప్రభుత్వం మే 1న విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్ నెలలో జీఎస్టీ రూపంలో రూ.2.37 లక్షల కోట్లు వసూలయ్యాయి. అంతకుముందు నెలలో అంటే మార్చిలో రూ.1.96 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. కాగా గతేడాది ఇదే నెలలో అంటే 2024 ఏప్రిల్‌లో ప్రభుత్వం రూ.2.1 లక్షల కోట్లు జీఎస్టీ కింద వసూలు చేసింది. వార్షిక వసూళ్ల వేగం 12.6 శాతంగా ఉండటం కూడా 17 నెలల్లో ఇదే గరిష్టం. ఆర్థిక వ్యవస్థకు వినియోగం తోడ్పడటంతో త్రైమాసిక వసూళ్లు 2025 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ .5.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయ లావాదేవీల నుంచి జీఎస్టీ ఆదాయం 10.7 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకున్న వస్తువుల ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది. ఏప్రిల్‌లో రీఫండ్ల జారీ 48.3 శాతం పెరిగి రూ.27,341 కోట్లకు చేరింది.


ఇక అంతకుముందు నెలల్లో జీఎస్టీ వసూళ్లను పరిశీలిస్తే ఫిబ్రవరిలో రూ.183,646 కోట్లు, జనవరిలో రూ.1.96 లక్షల కోట్లు, డిసెంబరులో రూ.1.77 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. బడ్జెట్లో ప్రభుత్వం ఈ సంవత్సరానికి జీఎస్టీ ఆదాయంలో 11% పెరుగుదలను అంచనా వేసింది. సెంట్రల్ జీఎస్టీ, పరిహార సెస్‌తో సహా వసూళ్లను రూ .11.78 లక్షల కోట్లుగా అంచనా వేసింది.

## అదానీ పవర్ తగ్గింది!

ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పవర్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం నీరసించి రూ. 2,599 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,737 కోట్లు ఆర్జించింది. రూ. 350 కోట్లమేర ఇబిటాపై వన్‌టైమ్ ఐటమ్ ప్రభావం పడినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం మాత్రం 5 శాతం వృద్ధితో రూ. 13,787 కోట్ల నుంచి రూ. 14,522 కోట్లకు బలపడింది. విద్యుత్ విక్రయాలు 26.4 బిలియన్ యూనిట్ల(బీయూ)కు చేరాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం భారీగా క్షీణించి రూ. 12,750 కోట్లకు చేరింది. 2023-24లో కేవలం రూ. 20,829 కోట్ల లాభం ఆర్జించింది. ఇందుకు ప్రధానంగా వన్‌టైమ్ ఐటమ్, అధిక పన్ను వ్యయాలు కారణమైనట్లు కంపెనీ తెలియజేసింది. మొత్తం ఆదాయం 11 శాతం పుంజుకుని రూ. 56,473 కోట్లకు చేరింది. ఈ కాలంలో 102.2 బీయూ విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా.. విక్రయాలు 21 శాతం ఎగసి 95.9 బీయూను తాకాయి. ఫలితాల నేపథ్యంలో అదానీ పవర్ షేరు బీఎస్ఈలో 3% క్షీణించి రూ. 532 వద్ద ముగిసింది.

**నష్టాల బాటలో జేఎస్‌పీఎల్**

ప్రయివేట్ రంగ దిగ్గజం జిందాల్ స్టీల్ అండ్ పవర్(జేఎస్‌పీఎల్) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. రూ. 304 కోట్ల నష్టం నమోదు చేసింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 933 కోట్ల నికర లాభం ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరు కి రూ. 2 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 15,749 కోట్ల నుంచి రూ. 15,525 కోట్లకు స్వల్పంగా క్షీణించింది. ఫలితాల నేపథ్యంలో జేఎస్‌పీఎల్ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 895 వద్ద ముగిసింది.






# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




## దూసుకొస్తున్న కాస్మోస్ 482

### భూమిపై కూలనున్న సోవియట్ అంతరిక్ష నౌక!

**శుక్ర గ్రహంపై దిగాల్సిన ల్యాండర్.. ప్రయోగం విఫలమై 53 ఏళ్లుగా భూకక్ష్యలోనే**

**మే 8-11 తేదీల్లో భూమిపై కూలే అవకాశం.**

సోవియట్ యూనియన్ ఎప్పుడో అర్ధ శతాబ్దం క్రితం ప్రయోగించిన అంతరిక్ష నౌక 'కాస్మోస్ 482' త్వరలో భూమిపై కూలబోతోంది. మే నెల 811 తేదీల మధ్య అది భూ వాతావరణంలోకి ప్రవేశిస్తుంది. శుక్ర గ్రహాన్ని పరిశోధించడానికి 1972 మార్చి 31న సోవియట్ ఈ అంతరిక్ష నౌకను ప్రయోగించింది. వాస్తవానికి 'కాస్మోస్ 482' ఓ లాండింగ్ మాడ్యూల్. 495 కిలోల ల్యాండరును శుక్రగ్రహంపై దింపడం ఈ మిషన్ ఉద్దేశం. సాంకేతిక లోపం తలెత్తి ప్రయోగం విఫలమవడంతో 'కాస్మోస్ 482' స్పేస్ క్రాఫ్ట్ ముందుకు ప్రయాణించడానికి అవకాశం లేక భూకక్ష్యలోనే ఇరుక్కుపోయింది. గత 53 సంవత్సరాలుగా అది భూమి కక్ష్యలోనే పరిభ్రమిస్తోంది. ఇప్పుడు కూలే సమయం ఆసన్నమవడంతో శాస్త్రవేత్తలు దాని ఆర్బిటల్ ఎత్తును నిరంతరాయంగా గమనిస్తున్నారు. అంతరిక్ష నౌక కచ్చితంగా ఏ తేదీన భూమిపై కూలుతుందో త్వరలో తెలుస్తుంది. మే 811 తేదీల్లో 'కాస్మోస్ 482' భూమిపై కూలవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నప్పటికీ... 'సూర్యుడి క్రియాశీలత' ప్రభావంతో సదరు తేదీలకు కాస్త ముందుగా గానీ, లేదా ఆ తర్వాత గానీ నౌక కూలే అవకాశం కూడా లేకపోలేదు. ఎందుకంటే సూర్యుడి క్రియాశీలత అధికంగా ఉంటే భూమి ఎగువ వాతావరణం త్వరగా వేడెక్కి వ్యాకోచిస్తుంది. ఫలితంగా దిగువ కక్ష్యలో పరిభ్రమించే వస్తువులను భూ వాతావరణం త్వరితగతిన లాక్కుంటుంది. అంటే 'కాస్మోస్ 482' అంతరిక్ష నౌక మనం అనుకున్న సమయం కంటే ముందుగానే కూలిపోవచ్చు.



### 52 డిగ్రీల ఉత్తర, దక్షిణ అక్షాంశాల్లో కూలవచ్చు!

భూ వాతావరణంలోకి అనియంత్రిత ప్రవేశం' కనుక 'కాస్మోస్ 482' స్పేస్ క్రాఫ్ట్ భూమిపై ఏ ప్రాంతంలో కూలిపోతుందో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కానీ ప్రస్తుతం నౌక కక్ష్యను పరిశీలిస్తే భూమిపై 52 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 52 డిగ్రీల దక్షిణ అక్షాంశం మధ్య గల సువిశాల ప్రదేశంలో... అంటే ఉత్తరాన బ్రిటన్ మొదలుకొని దక్షిణాన న్యూజిలాండ్ దాకా ఎక్కడైనా అది కూలవచ్చు. భూమిపై జలావరణమే అధికం కనుక నౌక నేలపై కాకుండా సముద్రాల్లో కూలిపోయే అవకాశాలే ఎక్కువ. సముద్ర ప్రదేశాలు కాకుండా భూభాగంపై లేదా జనావాస ప్రాంతాలపై అది కూలిపోయే అవకాశాలు స్వల్పమే అయినప్పటికీ ఓ అంశం శాస్త్రవేత్తలను కొంచెం కలవరపెడుతోంది. 'కాస్మోస్ 482'కు ఓ విశిష్టత ఉంది. అది 'వెనెరా' మిషన్ ల్యాండర్ల తరహా అంతరిక్ష నౌక. శుక్ర గ్రహంపై దిగేటప్పుడు అక్కడి కఠినాతి కఠినమైన అత్యధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర పీడనాన్ని తట్టుకునేలా 'కాస్మోస్ 482'ను రూపొందించారు. సాధారణంగా ఖగోళ వస్తువులు భూవాతావరణంలోకి ప్రవేశించాక గాలి ఒరిపిడికి మండిపోయి చిన్న శకలాలుగా రాలిపోతాయి. వాటిలోని పెద్ద, బరువైన భాగాలు మాత్రమే భూమిని తాకుతాయి. డిజైన్ ప్రత్యేకత దృష్ట్యా 'కాస్మోస్ 482' మాత్రం భూ వాతావరణంలోకి ప్రవేశించినా ధ్వంసం అవదు. సముద్రాల్లో కాకుండా అది భూభాగంపై కూలిపోవడమంటూ సంభవిస్తే... ఏమాత్రం చెక్కు చెదరకుండా 495 కిలోల 'కాస్మోస్ 482' ధడేల్మని 'ఒకే ముక్క'గా నేల రాలుతుంది! అలా చిన్న ఉల్క మాదిరి ప్రభావం చూపుతుంది. శాస్త్రవేత్తలకు ఆందోళన కలిగిస్తున్న అంశం ఇదే.

## పాక్ విమానాలకు భారత గగనతలం మూసివేత




**ఢిల్లీ:** పాకిస్తాన్‌ను మరింత ఇబ్బంది పెట్టేలా భారత్ మరో కఠిన నిర్ణయం తీసుకుంది. భారత్ గగనంతలంలో పాక్ విమాన ప్రయాణాలపై నిషేధం విధించింది. దీంతో పాకిస్థాన్ నుంచి భారత్ మీద నుంచి కాకుండా ఇతర దేశాల గగనం తలం నుంచి గమ్య స్థానాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే, భారత విమానాలకు పాకిస్తాన్ గగనతల మూసివేయడంతో ప్రతి చర్యగా భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు మే 24 వరకు కొనసాగనున్నాయి. అయితే ఈ గడువు మున్ముందు పరిస్థితులపై ఆధారపడి ఉండనుంది. భారత గగన తలంపై పాక్ విమానాల నిషేధం విధిస్తూ.. కేంద్రం అధికారికంగా ప్రకటించింది. 'భారత్ గగనం తలంపై పాక్ విమానాలు నిషేదం. వాటిల్లో పాక్ రిజిస్టర్డ్ విమానాలు, అలాగే పాక్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా, లేదంటే లీజుకు తీసుకున్న విమానాలకు భారత గగనతల ప్రవేశం లేదు. ఇందులో సైనిక విమానాలూ ఉన్నాయి' అని కేంద్రం విడుదల చేసిన నోట్‌లో పేర్కొంది. మరోవైపు భారత్ తీసుకుంటున్న వరుస నిర్ణయాలపై దాయాది దేశం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే పాక్‌కు చెందిన విమానాలు భారత్ గగనతలం మీద నుంచి ప్రయాణించకూడదన్న ఆదేశాలు అమల్లో ఉండగా.. ఇప్పుడు అధికారికంగా గగనతలాన్ని మూసివేస్తూ భారత్ ప్రకటన చేయడంపై దాయాది దేశం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ చర్య వల్ల దక్షిణ ఆసియా, ఓషియానియా ప్రాంతాలకు వెళ్లే పాక్ విమానాలు భారత గగన తలం మీద నుంచి పొరుగు దేశాల మీద నుంచి తిరిగి ప్రయాణించాల్సి వస్తుంది. ఆ ఫలితం పాక్ విమానయాన రంగంపై పడనుంది. విమానం ప్రయాణ సమయం పెరగడం, ఫ్లైట్ ఛార్జీలు పెరగడం, విమాన ఇంధన ధరలు పెరగడం, విమానాల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య తగ్గడం వంటి ప్రతికూల ప్రభావం పడనుంది. వెరసీ పాక్ మరిన్ని ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కోంది. ఇప్పటికే ఆర్థికంగా కుదేలైపోయిన పాకిస్తాన్ విమానయాన సంస్థలకు తాజా భారత నిర్ణయంతో అదనపు భారం పడనుంది.

## పహల్గాం ఉగ్రదాడి.. పాకిస్తాన్‌కు షాకిచ్చిన అమెరికా!


**వాషింగ్టన్ :** జమ్ముూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి అంశంపై పాకిస్తాన్‌కు అమెరికా షాకిచ్చింది. మతిలేని చర్యను వెనకేసుకు రావొద్దని హెచ్చరించింది. పహల్గాం దాడి విషయంలో చేపట్టే దర్యాప్తులో భారత్‌కు సహకరించాలని సూచించింది. పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో బుధవారం.. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాక్ ప్రధాని హహబాద్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఫోన్ సంభాషణలో రూబియో.. ఉగ్రవాదంపై భారత్ తీసుకునే ప్రతి చర్యలో అమెరికా పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. అదే సమయంలో పహల్గాంలో 26 మంది ప్రాణాలు తీసిన అమానుష చర్యపై భారత్ చేపట్టే దర్యాప్తుకు సహకరించాలని సూచించినట్లు సమాచారం. జైశంకర్‌తో మాట్లాడిన సమయంలో మార్కో రూబియో పహల్గాం దాడి బాధితులకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై జరిపే పోరాటంలో భారత్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ముందు నుంచి పహల్గాం ఉగ్రదాడి విషయంలో పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని భారత్ హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. ఈ విషయంలో ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, శాంతి భద్రతలను కాపాడుకోవడానికి పాకిస్తాన్‌తో కలిసి పనిచేయాలని భారత్ కృషి చేయాలని కోరారు. అందుకు ప్రతిస్పందనగా ఎక్స్ వేదికగా జైశంకర్ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో దాడికి పాల్పడ ఉగ్రవాదుల్ని, వాళ్లను పెంచి పోషిస్తున్న వారిని, పహల్గాం ఉగ్రదాడికి ప్రణాళిక వేసిన వారిని న్యాయం ముందు నిలబెట్టాలి' అని పేర్కొన్నారు. రుబియో పాకిస్తాన్ ప్రధాని షరీఫ్‌తో జరిపిన సంభాషణల్లో పాకిస్తాన్ పహల్గాం దాడిని ఖండించాలని, దర్యాప్తులో సహకరించాలని కోరారు. ఈ దాడిపై పాకిస్తాన్ బాధ్యత వహించాలని, భారత్‌తో నేరుగా సంభాషణలు పునరుద్ధరించి శాంతి దిశగా కృషి చేయాలని సూచించినట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. మరి తాజా పరిణామలపై భారత్ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.






# రెట్రో మూవీ రివ్యూ.. సూర్య హిట్ కొట్టాడా..?

**టైటిల్ : రెట్రో పైనే**
**నటీనటులు: సూర్య, పూజా హెగ్డే, జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ తదితరులు**
**నిర్మాణ సంస్థలు: స్టోన్ బెంచ్ క్రియేషన్స్, 2డి ఎంటర్టైన్మెంట్**
**నిర్మాతలు: జ్యోతిక, కార్తేకేయన్ సంతానం, రాజశేఖర్ పాండియన్**
**ఎడిటింగ్: షఫీక్ మొహమ్మద్ అలీ**
**దర్శకత్వం, కథ: కార్తీక్ సుబ్బరాజ్**
**సంగీతం: సంతోష్ నారాయణన్**
**సినిమాటోగ్రఫీ: శ్రేయాస్ కృష్ణ**
**విడుదల: మే1, 2025**




గతేడాదిలో భారీ అంచనాలతో విడుదలైన 'కంగువా' చిత్రం సూర్య (Suriya)కు చేదు అనుభవాన్ని మిగిల్చింది. ఈ సినిమా తర్వాత ఏలాగైన తన అభిమానులను సంతోషపెట్టాలని 'రెట్రో'పైనే ఆయన ఆశలు పెట్టుకున్నారు. దీంతో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రొమాంటిక్ యాక్షన్ ఫిల్మ్ ప్రాజెక్ట్‌ను తెరపైకి సూర్య తీసుకొచ్చాడు. ఇందులో పూజా హెగ్డే (Pooja Hegde) హీరోయిన్‌గా నటించగా.. జోజూ జార్జ్, జయరామ్, నాజర్ తదితరులు కీలక పాత్రలలో కనిపించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ 2 గంటలా 40 నిమిషాల రన్‌టైమ్ ఉంది. గతంలో దర్శకుడు సుబ్బరాజ్ తెరకెక్కించిన పేట, మహాన్, జిగర్తాండ, జిగర్తాండ డబుల్ ఎక్స్ చిత్రాల నిడివి కూడా ఇంతే ఉండటం గమనార్హం. యాక్షన్‌తో పాటు, ప్రేమ, భావోద్వేగాలతో కూడిన ఒక గ్యాంగ్‌స్టర్ రెట్రోతో మెప్పించాడా అనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

### కథేంటంటే..

గ్యాంగ్‌స్టర్ తిలకన్ (జోజు జార్జ్) కొడుకులా పెంచుకున్న పారివేల్ కన్నన్ (సూర్య)తో గ్యాంగ్‌స్టర్స్‌గా ఒక సామ్రాజ్యాన్నే ఏర్పాటు చేసుకుని చలామణి సాగిస్తుంటారు. అయితే, ఒకరోజు వారు ఫారిన్ గ్యాంగ్‌తో కుదుర్చుకున్న ఢీల్ (గోల్డ్ ఫిష్) వల్ల సమస్యలు వస్తాయి. అప్పటి వరకు తిలకన్ చెప్పిన ప్రతి విషయాన్ని పూర్తి చేసిన పారివేల్.. గోల్డ్‌ఫిష్ ఢీల్‌ను వదులుకోవాలని పెంచిన తండ్రికి ఎదరుతిరుగుతాడు. ఇదే సమయంలో తన ప్రియురాలు రుక్మిణి (పూజా హెగ్డే)ని వివాహం చేసుకోవడానికి పారివేల్ రెడీ అవుతుంటాడు. తనతో పెళ్లి తర్వాత గ్యాంగ్‌స్టర్ జీవితాన్ని వదులుకుని ఆమెతో సాధారణ జీవితాన్ని గడుపుతానని వాగ్దానం చేస్తాడు. అలాంటి సమయంలోనే గోల్డ్ ఫిష్ వివరాలు చెప్పాలని ఆ పెళ్లికి అడ్డుగా తిలకన్ నిలబడుతాడు. తన గ్యాంగ్‌తో ఆ వేడుకలో అల్లకల్లోలం సృష్టిస్తాడు. దీంతో పారివేల్ కన్నన్ మళ్లీ ఆయుధాలు పట్టాల్సి వస్తుంది. ఈ గొడవ కారణంగా ఐదేళ్లు జైలుకు వెళ్తాడు పారివేల్. గొడవలు అంటే నచ్చని రుక్మిణి అతని జీవితం నుంచి వెళ్లిపోతుంది. ఆమె ఆచూకి వివరాలు తెలుసుకోవాలని తన గ్యాంగ్‌ను కోరతాడు. చివరికి ఆమె అండమాన్‌లకు దూరంగా ఒక ఐల్యాండ్‌లో ఉన్నట్లు వివరాలు తెలుసుకుంటారు. ఆమెను ఎలాగైనా కలుసుకోవాలని జైలు నుంచి తప్పించుకున్న పారివేల్ ఆమె ఉన్న చోటుకు వెళ్తాడు. దీంతో తనను పెంచిన తండ్రి తిలకన్ కూడా గోల్డ్‌ఫిష్ వివరాలు కోసం అదే ఐలాండ్‌కు చేరుకుంటారు. అయితే, అప్పటికే అక్కడ ఒక పెద్ద గ్యాంగ్‌తో రాజ్‌వేల్ దొర (నాజర్) అతని కుమారుడు మైఖేల్ ఉంటారు. అక్కడి ప్రజలను తమ గుప్పెట్లో పెట్టుకుని అనేక దారుణాలు చేస్తుంటారు. వారితో ఒక ఢీల్ సెట్ చేసుకుని తిలకన్ అక్కడికి చేరుకుంటాడు. తన ప్రియురాలు రుక్మిణి కోసం పారివేల్ ఆ ప్రాంతంలో అడుగు పెట్టగానే మళ్లీ గ్యాంగ్ వార్ మొదలౌతుంది. అక్కడి నుంచి గోల్డ్‌ఫిష్ వేట కొనసాగుతుంది. ఇంతకీ గోల్డ్‌ఫిష్ సీక్రెట్ ఏంటి..? దాని కోసం పెంచిన కొడుకునే తండ్రి చంపాలని ఎందుకు అనుకుంటాడు..? అనాధగా ఉన్న పారివేల్‌కు ఆ ఐల్యాండ్‌తో ఉన్న గత సంబంధం ఏంటి..? అక్కడి గుడితో అతనికి ఉన్న అనుబంధం ఏంటి..? పారివేల్ పుట్టక ముందే రాజ్‌వేల్ దొర (నాజర్)తో ఉన్న లింక్ ఏంటి..? ఫైనల్‌గా రుక్మిణిని పారివేల్ పెళ్లి చేసుకుంటాడా..? అనేది తెలియాలంటే రెట్రో చూడాల్సిందే.

### ఎలా ఉందంటే..?

ఈ సినిమాకు ప్రధాన బలం దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, సూర్య తొలిసారి కలిసి పనిచేయడమే అని చెప్పవచ్చు. అందుకే, రెట్రో సినిమా ప్రేక్షకులలో చాలా ఆసక్తిని రేకెత్తించింది. ఊహించినట్లుగానే.. కార్తీక్ సుబ్బరాజ్, సూర్య బలాలను వెండితెరపై చూపించారు. యాక్షన్, రొమాన్స్ అంశాలను సమానంగా చూపించేందుకు దర్శకుడు ప్రయత్నం చేశాడు. చాలా సినిమాల్లో మాదిరే.. రెట్రో కథలో కూడా ప్రేమ కోసం అన్నీ వదులుకోవడానికి ప్రయత్నించే ఒక గ్యాంగ్‌స్టర్ గురించి చెప్పారు. ఇందులో అతను ఎలా విజయం సాధిస్తాడు అనేది కాస్త ప్రత్యేకంగా చూపారు. సినిమా మొదటి భాగంలో తిలకన్, పారివేల్, రుక్మిణిల చుట్టూ తిరుగుతుంది. భారీ యాక్షన్ సీన్స్‌లకు కాస్త రొమాంటిక్ టచ్ ఇచ్చి కథను చూపారు. అదంతా మనకు రొటిన్‌గానే అనిపించవచ్చు. సెకండ్ పార్ట్ అంతా ఒక ఐలాండ్‌లో జరుగుతుంది. అక్కడి నుంచి స్క్రీన్‌ప్లే గజిబిజిగా మారడం ప్రారంభమవుతుంది. ఆ ప్రాంతంలో ఉన్న గ్యాంగ్‌స్టర్స్ రాజ్‌వేల్ దొర (నాజర్) అతని కుమారుడు మైఖేల్‌తో పారివేల్ పోరాటం చేయాల్సి వస్తుంది. అక్కడి నుంచి పూర్తిగా భిన్నమైన ట్రాక్‌లోకి స్టోరీ వెళుతుంది. ఇక్కడే సినిమా కాస్త తడబడినట్లు అనిపిస్తుంది. అక్కడ ఐలాండ్‌లో జరిగే రబ్బర్ కల్ట్ పోటీలు కొత్తగా ఉంటాయి. ఆ పోటీల పేరుతో అక్కడున్న గిరిజన జాతి జీవితాలతో ఆడుకుంటున్న ఆ ప్రాంత రాజును పారివేల్ ఎదుర్కొన్న తీరు ప్రేక్షకుడికి సరికొత్త అనుభూతిని పంచుతాయి. ఐలాండ్‌లోని జడ ముని గుడి నేపథ్యంతో పాటు దానితో పారికి ఉన్న సంబంధం తెలిపిన పాయింట్ కాస్త భావోద్వేగభరితంగా కథను మారుస్తాయి. కథలో గ్రిప్పింగ్ లేకున్నా.. భారీ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను మెప్పిస్తాయి. సూర్య, పూజాల మధ్య సరైన లవ్ ట్రాక్ కనిపించదు. కానీ, వారిద్దరి మధ్య చాలా ఎమోషన్స్‌తో కూడిన ప్రేమ ఉన్నట్లుగా మనకు దర్శకుడు చూపే ప్రయత్నం చేశాడు. ఐల్యాండ్‌కు పారివేల్‌కు ఉన్న రిలేషన్ ఏంటి అనేది వివరంగా చెప్పడంలో విఫలం అయ్యాడనిపిస్తుంది. కథ, స్క్రీన్‌ప్లే రెట్రో సినిమాకు కాస్త మైనస్ అని చెప్పవచ్చు. కానీ, యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారు మాత్రం తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. సూర్య, పూజా హెగ్డేలను చాలా కొత్తగా దర్శకుడు చూపించారు.

### ఎవరెలా చేశారంటే..

సూర్య తన అన్ని చిత్రాల మాదిరిగానే ఈ మూవీలో కూడా తన ప్రతిభను చాటుకున్నాడు. యాక్షన్ అయినా, కామెడీ అయినా సూర్య చాలా అద్భుతంగా నటించాడు. పూజ హెగ్డేతో అతను కనిపించే సన్నివేశాలు పెద్దగా క్లిక్ కాకపోయిన కెమెరామెన్ పనితనంతో కాస్త గట్టెక్కించాడని చెప్పవచ్చు. రెట్రో డ్రెస్‌లో పూజా చాలా చక్కగా సెట్ అయిపోయింది. ఆపై గ్లామర్‌కు ఎలాంటి స్కోప్‌లేకుండా కేవలం యాక్టింగ్‌కు మాత్రమే ప్రాముఖ్యత ఇవ్వడంతో తన కెరీర్‌లో ఇదొక బెస్ట్ చిత్రంగా నిలుస్తుంది. మలయాళ నటుడు జోజు జార్జ్ తిలకన్ పాత్రలో మరోసారి తన ప్రతిభను ప్రదర్శించగా, మైఖేల్ పాత్రను పోషించిన నటుడు కూడా అద్భుతంగా నటించాడు. ప్రకాష్ రాజ్ అతిధి పాత్రలో కనిపిస్తాడు, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ కూడా అతిధి పాత్రలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరుస్తాడు. సంతోష్‌నారాయణ్ ఇచ్చిన సంగీతం రెట్రోకు బాగా ప్లస్ అయింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలను ఎలివేట్ చేసే అద్భుతమైన BGMను ఆయన అందించాడు. కన్నిమ పాట ఇప్పటికే థియేటర్లలో పెద్ద సంచలనంగా మారింది. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ చేసిన రెట్రో మంచి ప్రయత్నమే కానీ చాలా ట్రాక్‌లతో కూడిన గజిబిజి స్క్రీన్‌ప్లే వల్ల కాస్త ఇబ్బంది పెట్టొచ్చు. సూర్య, పూజా హెగ్డే తమ అభిమానులను రెట్రోతో తప్పకుండా అలరిస్తారు.

## టాలీవుడ్ యంగ్ హీరో కొత్త చిత్రం..
# డప్పులతో ఫస్ట్ లుక్ పోస్టర్




రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో అలరించిన యంగ్ స్టార్ ఆశిష్ మరో మూవీతో సిద్ధమైపోయారు. ఈ సినిమాతో ఆదిత్య రావు గంగసాని డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇవాళ ఆశిష్ పుట్టిన రోజు కావడంతో టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు , శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు దేత్తడి అనే టైటిల్ ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఆశిష్ హైదరాబాద్ వీధుల్లో కనిపించే డప్పు వాద్యకారుడి గెటప్‌లో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో బ్యాక్‌డ్రాప్‌లో డప్పులు మోగుతున్న గుంపు చుట్టూ జనం ఉత్సాహంగా డాన్స్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తే ఆశిష్ ఫుల్ మాస్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాదీ స్లాంగ్‌లో డైలాగులు చెప్పడం సినిమాకు మరింత హైలైట్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని మేకర్స్ వెల్లడించారు.

# సినిమాల్లో మామయ్యే నాకు ఆదర్శం..
## అల్లు అర్జున్ ఆసక్తికర కామెంట్స్!



ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సందడి చేశారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు హాజరైన బన్నీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. సినిమాల్లో నాకు మామయ్య మెగాస్టార్ చిరంజీవినే ఆదర్శమని ఐకాన్ స్టార్ ప్రశంసలు కురిపించారు. ఆయన ప్రభావం తనపై ఎప్పటికీ ఉంటుందని బన్నీ అన్నారు. దీంతో మెగాస్టార్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. గతేడాది పుష్ప 2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన బన్నీ ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ డైరెక్టర్‌తో జతకట్టారు. జవాన్‌తో సూపర్ హిట్ సాధించిన అట్లీతో కలిసి బన్నీ పనిచేయనున్నారు. ఇటీవలే వీరి సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. బన్నీ కెరీర్‌లో 22వ సినిమాగా రానున్న ఈ సినిమాపై ఐకాన్ స్టార్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా గురించి కూడా అల్లు అర్జున్ ఈవెంట్‌లో ప్రస్తావించారు. తప్పకుండా అభిమానులు ఆశించిన స్థాయిలో విజువల్ ప్రెజెంటేషన్ ఉంటుందని బన్నీ చెప్పుకొచ్చారు.





# ముంబై డబుల్ హ్యాట్రిక్
## ప్లే ఆఫ్స్ రేసు నుంచి రాజస్థాన్ ఔట్

ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (మే 1) జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై ముంబై ఇండియన్స్ 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్.. ర్యాన్ రికెల్టన్ (38 బంతుల్లో 61; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రోహిత్ శర్మ (36 బంతుల్లో 53; 9 ఫోర్లు), సూర్యకుమార్ యాదవ్ (23 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), హార్దిక్ పాండ్యా (22 బంతుల్లో 48 నాటౌట్; 6 ఫోర్లు, సిక్స్) చెలరేగడంతో నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 217 పరుగుల భారీ స్కోర్ చేసింది. రాయల్స్ బౌలర్లలో రియాన్ పరాగ్, తీక్షణ తలో వికెట్ తీశారు. అనంతరం 218 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన రాయల్స్ ముంబై బౌలర్లు మూకుమ్మడిగా చెలరేగడంతో 16.1 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. రాయల్స్ ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ (30) టాప్ స్కోరర్‌గా నిలువగా.. యశస్వి జైస్వాల్ (13), రియాన్ పరాగ్ (16), ధృవ్ జురెల్ (11), శుభమ్ దూబే (15) రెండంకెల స్కోర్లు చేయగలిగారు. గత మ్యాచ్‌లో 35 బంతుల్లోనే సెంచరీ చేసిన చరిత్ర సృష్టించిన రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో డకౌటయ్యాడు. ముంబై బౌలర్లలో కర్ణ్ శర్మ, బౌల్ట్ తలో మూడు వికెట్లు తీయగా.. బుమ్రా 2, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్యా చెరో వికెట్ దక్కించుకున్నారు. ఈ గెలుపుతో ముంబై డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకుపోయింది. రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

# చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ



వెటరన్ ఓపెనర్ రోహిత్ శర్మ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున 6000 పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా నిలిచాడు. ఐపీఎల్ 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఇవాళ (మే 1) జరుగుతున్న మ్యాచ్‌లో రోహిత్ ఈ ఘనత సాధించాడు. 2011 నుంచి ఇప్పటివరకు ముంబై ఇండియన్స్ ఆడుతున్న హిట్‌మ్యాన్ ఆ ఫ్రాంచైజీ తరపున 231 మ్యాచ్‌లు ఆడి 2 సెంచరీలు, 38 హాఫ్ సెంచరీల సాయంతో 6017 పరుగులు చేశాడు. ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో రోహిత్‌కు దరిదాపుల్లో కూడా ఎవరూ లేరు. రోహిత్ తర్వాత కీరన్ పోలార్డ్ ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ఉన్నాడు. పోలీ ఎంఐ తరపున 211 మ్యాచ్‌ల్లో 18 హాఫ్ సెంచరీల సాయంతో 3915 పరుగులు చేశాడు. పోలార్డ్ తర్వాత సూర్యకుమార్ యాదవ్ ఎంఐ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ఉన్నాడు. స్కై ఈ ఫ్రాంచైజీ తరపున 109 మ్యాచ్‌ల్లో 2 సెంచరీలు, 26 హాఫ్ సెంచరీల సాయంతో 3460 పరుగులు చేశాడు. ఈ జాబితాలో స్కై తర్వాతి స్థానాల్లో అంబటి రాయుడు (2635), సచిన్ టెండూల్కర్ (2599) ఉన్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న ముంబై ఇండియన్స్ భారీ స్కోర్ దిశగా సాగుతుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (53), ర్యాన్ రికెల్టన్ (61) ఆ జట్టుకు శుభారంభాన్ని అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 116 పరుగులు జోడించారు. అనంతరం స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరు ఔటయ్యారు. 15 ఓవర్ల ముగిసే సమయానికి ముంబై స్కోర్ 146/2గా ఉంది. సూర్యకుమార్ యాదవ్ (18), హార్దిక్ పాండ్యా (10) క్రీజ్‌లో ఉన్నారు.



## ధోనికి ఇలా జరగడం
# ఇదే తొలిసారి..!

ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా నిష్క్రమించింది. నిన్న (ఏప్రిల్ 30) పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమితో ఈ సీజన్‌లో ఆ జట్టు ఖేల్ ఖతమైంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కే ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం రెండే విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉంది. ఈ జట్టు ఈ సీజన్‌లో మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. సీఎస్‌కేకు ఈ మ్యాచ్‌లు అంత ముఖ్యం కాకపోయినా ఇతర జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలను నిర్ణయిస్తుంది. సీఎస్‌కే తమ తదుపరి మ్యాచ్‌ల్లో ఆర్సీబీ (మే 3), కేకేఆర్ (మే 7), రాజస్థాన్ రాయల్స్ (మే 12), గుజరాత్ టైటాన్స్‌తో (మే 18) తలపడనుంది. పైన ఉన్న జట్లన్నీ ప్లే ఆఫ్స్ రేసులో ఉండటంతో సీఎస్‌కే నిర్ణయాత్మక శక్తిగా మారనుంది. ఇదిలా ఉంటే, ఈ సీజన్ ఆరంభంలో రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో ధోని సీఎస్‌కే పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ధోని కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినా సీఎస్‌కే తలరాత ఏమీ మారలేదు. వరుస పరాజయాలతో సతమతమైంది. ఫ్యాన్స్ సైతం చాలా రోజుల కిందటే సీఎస్‌కేపై ఆశలు వదులుకున్నారు. ఈ సీజన్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత ధోని ఓ అపప్రదను మూటగట్టుకున్నాడు. తొలిసారి వరుసగా రెండు ఐపీఎల్ ఫైనల్స్ మిస్ అయ్యాడు (కానున్నాడు). ఐపీఎల్ ప్రారంభం నుంచి ఆడుతున్న ధోని ఇప్పటివరకు ఒక్కసారి కూడా వరుసగా రెండు ఫైనల్స్ ఆడకుండా ఉండలేదు. ఓ సీజన్ మిస్ అయినా మరుసటి సీజన్‌లోనే ఫైనల్ ఆడాడు. మొత్తంగా ధోని తన ఐపీఎల్ కెరీర్‌లో 11 ఫైనల్స్ (10 సీఎస్‌కే తరపున, ఒకటి రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ తరపున) ఆడాడు.

**ధోని ఆడిన ఐపీఎల్ ఫైనల్స్..**

2008 (రన్నరప్)
2010 (ఛాంపియన్)
2011 (ఛాంపియన్)
2012 (రన్నరప్)
2013 (రన్నరప్)
2015 (రన్నరప్)
2017 (రన్నరప్, పూణే తరపున)
2018 (ఛాంపియన్)
2019 (రన్నరప్)
2021 (ఛాంపియన్)
2023 (ఛాంపియన్)

**ధోని ఆడని ఐపీఎల్ ఫైనల్స్**

2009, 2014, 2016, 2020, 2022, 2024, 2025

# అంతా అయిపోయాక విధ్వంసకర వీరుడికి పిలుపునిచ్చిన సీఎస్‌కే..?

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కథ ముగిసింది. ఆ జట్టు మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా, ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. తద్వారా ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా నిలిచింది. ఐపీఎల్‌లో సీఎస్‌కే వరుసగా రెండు సీజన్లలో ఫైనల్‌కు చేరకుండా నిష్క్రమించడం ఇదే మొదటిసారి. ఈ సీజన్‌లో సీఎస్‌కే ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం రెండే విజయాలు సాధించింది. ఏ జట్టు ఓడని విధంగా 8 మ్యాచ్‌ల్లో ఓడింది. సీఎస్‌కే ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన తర్వాత ఓ వార్త సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌ల కోసం సీఎస్‌కే యాజమాన్యం ఓ విధ్వంసకర వీరుడిని ట్రయల్స్‌కు పిలిచినట్లు సమాచారం. సీఎస్‌కే మేనేజ్‌మెంట్ గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్‌ను మిడ్ సీజన్ ట్రయల్స్‌కు పిలిచినట్లు ఓ భారత మాజీ ఆటగాడు చెప్పాడు. ఉర్విల్ గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో (టీ20) 28 బంతుల్లోనే (త్రిపురపై) సెంచరీ చేసి చరిత్ర సృష్టించాడు. పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో ఇది రెండో వేగవంతమైన సెంచరీ. పొట్టి క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ పేరిట ఉంది. సాహిత్ గతేడాది సైప్రస్‌పై 27 బంతుల్లోనే శతకొట్టాడు. 26 ఏళ్ల ఉర్విల్ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్. ఇతనికి దేశవాలీ క్రికెట్‌లో మంచి రికార్డు ఉంది. 10 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో సెంచరీ, 2 అర్ధ సెంచరీలు.. 22 లిస్ట్‌ఏ మ్యాచ్‌ల్లో 3 సెంచరీలు, 2 హాఫ్ సెంచరీలు.. 47 టీ20ల్లో 2 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలు చేశాడు. ఉర్విల్‌ను సీఎస్‌కే మేనేజ్‌మెంట్ తదుపరి సీజన్ ప్రణాళికల్లో భాగంగా ట్రయల్స్‌కు పిలిచినట్లు తెలుస్తుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# ఏలూరులో కార్మికుల వినూత్న ప్రదర్శన




**ఏలూరు జిల్లా మహా :** 139వ మే డే కార్మిక దినోత్సవం సందర్భంగా ఏలూరు నగరంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు వినూత్నంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఏలూరు గడియార స్తంభం సెంటర్ దగ్గర జట్లు లాగుడు బండ్ల కార్మికులు ఆ సంఘం ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా కార్మికులు 1 టౌన్ మెయిన్ మార్కెట్ ప్రధాన వీధుల మీదుగా బిర్లా భవన్ సెంటర్ కన్నయ్య పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కార్మికులు దేశాన్ని పట్టిపీడిస్తున్న ఉగ్రవాదాన్ని అరికట్టాలని కోరుతూ ఒక కార్మికుడు ఉగ్రవాది వేషధారణలో తుపాకీతో ప్రజల్ని కాలుస్తున్నట్లు కలియతిరిగారు దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న అధిక ధరలను అరికట్టాలని ఒక మహిళా కార్మికురాలు, కార్మికుడు గ్యాస్ సిలిండర్ ఆకృతిని, తన భుజంపై మోస్తూ ఈ ధరల భారం మోయలేక* పోతున్నామని ప్రదర్శన ముందు భాగంగా ఈ నడవసాగారు.మరో ఇద్దరు కార్మికులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రదర్శిస్తూ మేడే ప్రదర్శన ముందు బాగాన ఆకర్షణగా నిలుచున్నారు.మేడే కార్మికుల ప్రదర్శనలో ఈ విధంగా వినూత్నంగా కార్మికులు ప్రజల సమస్యల పట్ల ప్రదర్శనలో పాల్గొనడం చూసి, ప్రజానీకం వారిని విశేషంగా తిలకించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ డాంగే ఏ ఐ టి యు సి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరావు జిల్లా నాయకులు పి కిషోర్ జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు లు మాట్లాడుతూ 1886 లో అమెరికా చికాగో నగరంలో జరిగిన మహత్తర పోరాటమే మేడేకు నాంది పలికిందని అన్నారు. ఆనాడు బానిసత్వంలో నిర్దిష్ట పని గంటలు లేకుండా రోజుకు 14 నుండి 20 గంటల వరకు పనులు చేయించే వెట్టి చాకిరిని ప్రతిఘటిస్తూ అక్కడ కార్మిక వర్గం వీరోచితమైన పోరాటం చేసిందన్నారు. ఆ పోరాటంలో ఏడుగురు కార్మికులు అమరవీరులయ్యారన్నారు వందలాది మంది కాల్పుల్లో గాయపడ్డారన్నారు. కార్మికుల రక్తంలో తడిసిన దుస్తులే ఎర్రజెండాగా మారి పోరాడే కమ్యూనిస్టు పార్టీలకు చిహ్నంగా మారాయని గుర్తు చేశారు.మేడే పోరాట స్ఫూర్తితో 1917 లో రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదం అయ్యిందన్నారు. ఆ విప్లవ భావాలతో భారతదేశంలో 1920లో ఏఐటియుసి ఏర్పడిందని అన్నారు. దేశంలో ఏఐటియుసి స్వాతంత్ర పోరాటంలో కార్మిక వర్గాన్ని నిలబెట్టడంతో పాటు నేడు కార్మికులు అనుభవిస్తున్న కార్మిక చట్టాలను పోరాడి సాధించిందని అన్నారు ఎనిమిది గంటల పని హక్కు, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ ,బోనస్, గ్రాడ్యుటీ, సెలవులు ,ఇన్సూరెన్స్ తదితర చట్టాలన్నీ మేడే పోరాటస్ఫూర్తితో ఏఐటియుసి ద్వారా కార్మికులు సాధించుకున్నరని గుర్తు చేశారు. అటువంటి కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేడు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చాలని చూస్తుందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి వేసిందని గుర్తు చేశారు. ఈ మేడే స్ఫూర్తితో బిజెపి అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పుగొడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ.అప్పలరాజు, నాయకులు బి జగన్నాధ రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, పోలా భాస్కర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రాంతి కుమార్, జట్లు లాకగుడు బండ్ల కార్మిక సంఘం కార్యదర్శి వంగల పూడి గంగరాజు, కోశాధికారి పెచ్చెట్టి శ్రీను, కమిటీ నాయకులు ఎస్ సోమేశ్వరరావు, గొర్రిల అప్పారావు, పెచ్చెట్టి నూకరాజు, కరణం సురేష్, కంటపురెడ్డి భాస్కరరావు, ఎస్ బాపూజీ, ఘంటసాల దుర్గాప్రసాద్, సుందరపు శ్రీను, యాదగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పనుల నాణ్యతా లోపాలు సహించేది లేదు

## జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



**పాడేరు /పెదబయలు ,మహా :** పెదబయలు మండలం ఎగువ పేదపల్లి గ్రామంలో జల్జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్నగ్రావిటీ పథకం పనులు నాణ్యతలో లోపాలు ఉంటె సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టర్ పెదబయలు మండలంలో పలు గ్రామాలు సందర్శించి గ్రామస్తుల తో మాట్లాడారు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్ వారికి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పలు సమస్యలపై నివేదించారు. జడిగూడ గ్రామంలో త్రాగునీటి సమస్య ఉన్నందున గ్రావిటీ స్కీం మంజూరు చేయాలని గ్రామస్తులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేసారు. అయితే గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఎనిమిది లక్షలు మంజూరై ఉందని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే పనులను ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్తుల అభ్యర్ధన మేరకు గ్రావిటీ పథకానికి సంబంధించిన వారి గ్రామ సమీపంలో కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచినీటి ఊటను కలెక్టర్ సందర్శించారు. సదరు ఊట ప్రదేశంలో సక్రమంగా కుండీని నిర్మించి చుట్టుపక్కల ప్లాంటేషన్ చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. అంగన్వాడి కేంద్రం మరమ్మత్తులకు అంచనాలు వేసి పంపిస్తే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా వనబంగి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనము పూర్తికి కూడా అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు సమర్పించాలని మండల ఇంజనీర్ ను ఆదేశించారు. వనబంగి గ్రామపంచాయతీకి చెందిన గడ్డి వలస గ్రామస్తులు వై. పేడపల్లి నుండి గడ్డి వలస వరకు తారు రోడ్డు మంజూరు చేయాలని, వనబంగి సర్పంచ్ వనబంగి గ్రామ పంచాయతీ పరిధిలో గల దిగువ పేడపల్లి దమ్ము గూడ పనసపుట్టు, తోటలగొంది, డుంబా గూడ గ్రామాలలో సిసి రోడ్లు నిర్మించాలని కోరగా అందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీల అభ్యర్ధన మేరకు నిమ్మ గుంట నుండి సీకరి పంచాయితీ లబ్బరి వరకు కిలోమీటర్ వరకు తారు రోడ్డు నిర్మాణం కొరకు కూడా ప్రతిపాదనలు పంపించమని ఆదేశించారు. జడిగూడ గ్రామం నుండి కొర్రహరికి సదరం సర్టిఫికెట్ ఉన్నప్పటికీ వికలాంగుల పింఛను మంజూరు కావట్లేదని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా తదుపరి ప్రభుత్వం ఉత్తర్వులు వచ్చిన తర్వాత పింఛను మంజూరుకు ప్రతిపాదించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డి ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణయ్య తాసిల్దార్ జి. రంగారావు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మత్స్యలింగం, మండల ఇంజనీరింగ్ అధికారి శివరామయ్య, ఫైర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాముడు, డి ఆర్ డి ఎ ఏపీఎం దేవమంగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఏపీఓ సూరిబాబు, వైస్ ఎంపీపీ శ్రీ కొర్ర రాజబాబు, కన్సల్టెంట్ శ్రీ పార్థసారథి, వనబంగి గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్రా కాసులమ్మ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాయకరావుపేట నియోజకవర్గంలో క్రియాశీలక కిట్ల పంపిణీ

## సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ,జనసేన.. రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్




**అనకాపల్లి జిల్లా ,పాయకరావుపేట ,మహా :**పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ,జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాలలో గల 108 మంది క్రియా వాలంటీర్స్ తో 14354 పార్టీ సభ్యత్వాలు నమోదు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. జనసేన కేంద్ర కార్యాలయం మంగళగిరి నుంచి ప్రెసిడెంట్ , టీమ్ సభ్యులు విచ్చేశారని తెలిపారు. ఈ ప్రక్రియలో తొలి మూడు స్థానాల్లో గెద్దం చలపతి, నల్లల రత్నాజీ, పిక్కి స్వామి నిలిచారని పేర్కొన్నారు. వారిని నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ గెడ్డం బుజ్జి, పార్టీ ముఖ్య నాయకులు తోట నగేష్ లు అభినందించారు . ఈ కార్యక్రమంలో జనసేన ఎంపీటీసీలు ఆకేటి గోవిందరావు, పేర్ల మాధవ, మాకినీడు చిట్టిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవవరపు రఘు, ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పల్లి దుర్గారావు, పక్కుర్తి కృష్ణ, పార్టీ సర్పంచ్ పులగపురి అప్పలనర్స, మండల పార్టీ అధ్యక్షులు వెలగ సుధాకర్, వై నానాజి, పప్పల శివ, మత్స్యకార విభాగ సభ్యుడు సంజీవరావు, పార్టీ ముఖ్య నాయకులు జగ్గన్నదొర, పాము గణేష్, ఆచంట దొర, యలమంచిలి చంద్రరావు, లింగంపల్లి జ్యోతికుమార్ , బాలేపల్లి ఏసు, ఉగ్గిన రాము, రంగ, పిక్కి గోవిందు, మేరుగు మహేష్, బత్తిన గోవిందరావు, రాజు బంగారి, కోసూరు నాని, సుంకర సాయి మరియు క్రియా వాలంటీర్స్ పాల్గొన్నారు.

# మంచాలలో ఘనంగా కార్మిక దినోత్సవం వేడుకలు

## ఎనిమిది గంట పని దినాల రక్షణకై కార్మికులు సిద్ధం కావాలి

### లేబర్ కోడ్స్ కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలం

### మోడీ ప్రభుత్వం చరిత్ర తెలుసుకోవాలి.. సిఐటియు మండల కన్వీనర్ పొచమోని కృష్ణ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై, ఎనిమిది గంట పని దినాల రక్షణకై కార్మికులు ఐక్యంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు మండల కన్వీనర్ పొచమోని కృష్ణ అన్నారు. మే డే దినోత్సవం సందర్భంగా గురువారం మంచాల మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ పొచమోని కృష్ణ ఆధ్వర్యంలో కార్మికుల సమక్షంలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పొచమోని కృష్ణ, గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు మాట్లాడుతూ.... ఎనిమిది గంటల పని విధానం పోరాడి సాధించారని, మళ్ళీ 12 గంటలు పని విధానం అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర పాలకులు చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే అనేక సంస్థల్లో 12 గంటలు కార్మికులతో పని చేయిస్తున్నారన్నారు. దీనిని చట్టబద్ధత చేయాలని ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్మికోద్యము తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమని, లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మిక చరిత్రలో 1886 చికాగోలోని కార్మిక తిరుగుబాటు ఉద్యమం కార్మిక ఉద్యమాన్ని మలుపు తిప్పిందని, 12 గంటల పని విధానాన్నికీ వ్యతిరేకంగా అమెరికా చికాగో నగరంలో పోరాడి 8 గంటల పని దినాలు సాధించుకున్న ఘన చరిత్ర ఉందన్నారు. మోడీ ప్రభుత్వం చరిత్ర తెలుసుకోకుండా కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు నిరంతరం కార్మికుల హక్కుల రక్షణ కోసం, సమస్యల పరిష్కారం కోసం సిఐటియు పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. కార్మికుల పక్షాన నిలబడి అనేక విజయాలను సాధించిందని అన్నారు. ఇకముందు కూడా కార్మికులు ఐక్యంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమ బాట నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రావుల జంగయ్య, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు నర్సింగ్ పద్మ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా నాయకులు అలివేలు, గ్రామం పంచాయతీ ఉద్యోగ కార్మిక యూనియన్ నాయకులు జగన్, అర్జున్, కృష్ణ, శాలమ్మ, సురేష్, భవన్ నిర్మాణ సంఘం నాయకులు శేఖర్, విజయ్, అంగన్వాడి టీచర్లు అనిత, జంగమ్మ, శంకరమ్మ, ఆయాలు కవిత, పద్మ, శైలజ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అండాలు, భ్రతమ్మ, పద్మమ్మ, గ్రామ పంచాయతీ కార్మికులు మహేష్, నర్సమ్మ, రాములమ్మ, హమాలీ కార్మికులు దుర్గయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## గాయపడిన కార్యకర్తను పరామర్శించిన వినోద్ కుమార్

**కరీంనగర్ మహా:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడికరీంనగర్ఆసుపత్రిలోచికిత్సపొందుతున్న గోదావరిఖని పట్టణానికి చెందిన వేల్పుల ఓదెలును గురువారం రెన్ హాస్పిటల్ లో మాజీ ఎం.పీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ పరామర్శించారు. ఓదేలుకు ధైర్యం చెప్పిన వినోద్ కుమార్.. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన బీ ఆర్ ఎస్ భారీ బహిరంగ సభకు హాజరై తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓదెలు గాయపడ్డారు. ఈ కారిక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీకి కుట్టు శిక్షణా కేంద్రం





**విశాఖ ,భీమిలి ,మహా :** భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు యువ నాయకులు గంటా రవితేజ గురువారం 5వ వార్డు మారికవలస తుఫాన్ షెల్టర్ బిల్డింగ్ లో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ వారికి స్థిర జీవనోపాధి కొరకు కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ వారికి కూడా వారి జీవనోపాధి మెరుగుపరిచి సమాజంలో వారికి సమాన హక్కు కల్పించే విధంగా ఈ శిక్షణా కేంద్రం ప్రారంభించడం జరిగిందని, ఇదే స్ఫూర్తితో అన్ని రంగాల్లో వారు శిక్షణ పొంది జీవనోపాధే కాకుండా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, నాయకులు మొల్లి రమణ, 5వ వార్డు ,కార్యదర్శి ఈగల రవికుమార్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షన్లు పంపిణీ చేసిన భీమిలి ఎమ్మెల్యే గంటా



**విశాఖ ,మధురవాడ,మహా :** జీవీఎంసీ 4 వ పరిధిలోని మంగమారి పేట లో లబ్ధిదారులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇతర పథకాలు అందుతున్నాయా, లేదా అన్నది లబ్ధిదారులను ఆరా తీశారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాసి త్రినాధ్, గరికిన ఎల్లాజీ (కింగ్) తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారికి 500 గ్రాముల వెండిని బహుకరించిన భక్తులు

**వరంగల్ మహా;:** శ్రీ ధన మైసమ్మ తల్లి అమ్మవారికి తూములూరి సంధ్యా రాణి, సత్యనారాయణ 250 గ్రాముల వెండి, అలాగే పులుమాటి శ్రీనివాస్ అన్నపూర్ణ దంపతులు 250 గ్రాముల వెండి అమ్మవారికి అభయ హస్తాల కోసమై మొత్తం 500 గ్రాముల వెండిని భక్తులు బహుకరించడం జరిగిందని ఆలయ అధ్యక్షులు తోట బాబన్న తెలిపారు. ఈ సందర్భంగా బాబన్న మాట్లాడుతూ ఎంతో భక్తితో అమ్మవారి అభయాస్తాలకు వెండిని బహూకరించిన వారి కుటుంబం పై శ్రీ ధన మైసమ్మ అమ్మవారి కృపా కటాక్షం ఉండాలనీ వారు కోరుకున్న కోరికలు నేరవేర్చాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నామని ఆలయ అధ్యక్షులు తోట బాబన్న పేర్కొన్నారు.

# దేశానికి వెన్నెముక శ్రామిక శక్తి

## నగర మేయర్ గుండు సుధారాణి.. కార్మిక లోకానికి శుభాకాంక్షలు తెలిపిన మేయర్



**వరంగల్, మహా;** దేశానికి వెన్నెముక శ్రామిక శక్తి అని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయ పడ్డారు. గురువారం అంతర్జాతీయకార్మిక దినోత్సవం (మే డే) ను పురస్కరించుకొని. మేయర్ కార్మిక లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ కార్మికుల అవిశ్రాంత, అంకిత భావానికి ఐక్యత కు మే డే నిదర్శనం అని ప్రపంచాన్ని నడిపే శ్రామిక శక్తికి వందనాలు తెలిపిన మేయర్ శ్రమ జీవుల స్వేదమే దేశానికి నిజమైన సంపద అని కష్టించే ప్రతి గుండెకు వందనాలు తెలియజేస్తున్నట్లు మేయర్ తెలిపారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా షాద్ నగర్ యువతి మధులిక తేజ



**షాద్‌నగర్,మహా:** ప్రముఖ వ్యాపారవేత్త మాజీ షాద్ నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ దాకన్న ప్రభాకర్ రెండవ కూతురు మధులిక తేజ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. మొదటిసారి పరీక్షలో ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు, సమాజంలో గుర్తింపు, గౌరవం, తెచ్చిన "మధులికతేజ"ని పెదనాన్న దాకన్న ఉగ్రసేన, బాబాయిలు దాకన్నగారి పూర్ణచందర్, దాకన్నగారి శ్రీనివాస్ అన్నయ్యలు దాకన్నగారి మనీష్, అభిలాష్, అనుదీప్, తమ్ముడు అనురాగ్, మరియు స్నేహితులు ,కుటుంబ సభ్యులు, బంధువులు ,అభినందనలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు..

## సమాజంలో చదువుతోనే గుర్తింపు

### విద్యార్థినులను అభినందించిన మంత్రి సీతక్క

**తాడ్వాయి, మహా:** చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. పదవ తరగతి పరీక్షలలో ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తాడ్వాయి కి చెందిన విద్యార్థినిలు కబ్బక చైత్రశ్రీ తాడ్వాయి మండల ద్వితీయ స్థానం ,మండల తృతీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన దబగట్ల ప్రవీణలను తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్, విద్యార్థినులను సన్మానించి అభినందనలు తెలియజేశారు.సమాజంలో చదువుతో గుర్తింపు మరియు హోదా లభిస్తుందని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలకు దీటుగా మెరుగైన విద్య ఆహారం తో పాటు అనేక రంగాలలో నైపుణ్యం కల్పించి విద్యార్థులను ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



## మకర,చంద్రప్రభ వాహనాల పై అమ్మవారి ఊరేగింపు

**వరంగల్, మహా;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం తో మూడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4.00 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించి చతుస్థానార్చన జరిపి ఉదయం అమ్మవారిని మకర వాహనం పై సాయంకాలం చంద్రప్రభ వాహనం పై ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. చల్లదనానికి ప్రతీక చంద్రుడు చంద్రప్రభ వాహనం మీద సేవింపబడుతున్న అమ్మవారిని దర్శించడం వల్ల మనస్సుకు స్వాంతన లభిస్తుందని స్వాంతచిత్తుడైన జీవుడికి సాధనలో సంపత్తి కలిగి ఇహపర సౌఖ్యాలతో వర్ధిల్లుతాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా ఆర్య వైశ్య (పట్టణ) సంఘం, వరంగల్ వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ప్రముఖులు ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్రావు, ప్రోగ్రాం కన్వీనర్లు తొనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, అయితా గోపీనాథ్, అల్లాడి వీరభద్రయ్య, గుండా హైమావతి, శ్రీరాం శైలజ, తదితరులు పాల్గొన్నారు. పూజానంతరం మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు దాదాపు వెయ్యి మందికి ఆర్యవైశ్య కులసంఘం వారు అన్నప్రసాద వితరణ చేశారు.

# మాజీ కన్వీనర్ కీర్తిశేషులు మల్లవరపు వీరభద్రరావు 60 జయంతి వేడుకలు



**అనకాపల్లి జిల్లా , పాయకరావుపేట మహా న్యూస్:** పాయకరావుపేట పట్టణం తొలితరం ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్ మాజీ కన్వీనర్ కీర్తిశేషులు మల్లవరపు వీరభద్రరావు 60 జయంతి వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు మరియు అభిమానుల మధ్య స్థానిక చిత్రమందిర్ థియేటర్ వద్ద సీనియర్ రిపోర్టర్ కుందురు రాణా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పాయకరావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పన్న చేతుల మీదుగా పూలమాలవేసి ఘన నివాళులర్పించి జోహార్ కీర్తిశేషులు మల్లవరపు వీరభద్రరావు అంటూ నినాదాలు చేస్తూ కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేసిన అనంతరం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి కుమార్ మరియు మల్లవరపు విరభద్ర రావు కుమారుడు న్యాయవాది ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని నినాదంతో దళితులందరూ చదువుకోవాలని దళితులకు ఏ విధమైన కష్టం వచ్చినా దాన్ని పరిష్కరించి ఏటువంటి వివాదాలు లేకుండా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో ముందుకు పోయావరని అటువంటి మంచి వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోవడం తీరని లోటని ఆయన లేకపోయినా ఆయన ఆశయాలు మాత్రం మనతోనే బ్రతికి ఉంటాయని ప్రతి సంవత్సరం ఆయన జయంతి వేడుకలు నిర్వహించుకోవడం తమకు కెంతో ఆనందకరమని అన్నారు.